# రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాట్రగడ్డ సతీష్



2లో..




వరంగల్ వార్త

వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్, జనగామ, ములుగు

సోమవారం 26, అక్టోబర్ 2026 16 పేజీలు




వనదేవతల సన్నిధిలో అపరిశుభ్రత తాండవం..!

జంపన్న వాగు మెట్లపై చెత్త కుప్పలు

అధికారుల మొద్దు నిద్రకు సాక్ష్యాలు..

నీటి ఆవాసాలు నడుమ

పందుల స్వైర విహారపు జోరు..

ఎప్పటికీ మారుతుందో

అధికారుల నిర్లక్ష్యపు తీరు

కంపు కొడుతున్న కంక వనాలు..

అపరిశుభ్రతకి నిలయాలు

ఆదివారం మేడారంలో భక్తుల సందడి

2 లో..

# అధికారులారా.. బాధ్యత మరిచారా..?

ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో, ప్రభాతవార్త, అక్టోబర్ 25:

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మేడారంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వనదేవతలైన సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. తమ కోరికలు తీర్చాలని, మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు పోటెత్తారు. మరోవైపు భక్తుల రద్దీ పెరిగినా అధికారుల నిరక్ష్యం మాత్రం పరాకాష్టకు చేరింది.కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవాలైన సమ్మక్క-సారలమ్మ కొలువుదీరిన మేడారం క్షేత్రంలో పారిశుద్ధ్య నిర్వహణలో అధికారుల తీరుపై..



## స్టిక్కర్ల మాటున
# లిక్కర్ అక్రమ వ్యాపారం!



2 లో..



మద్యం మాఫియాకు అడ్డుకట్ట వేయాలి

అధిక ధరలతో మందుబాబుల జేబులకు చిల్లు..

అధికారుల పర్యవేక్షణ ఏదీ?

ఎల్కతుర్తి అక్టోబర్ 25 ప్రభాతవార్త

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో మద్యం అక్రమ వ్యాపారం, బెల్ట్ షాపుల నిర్వహణపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్రంలో రెండు వైన్ షాపులు ఉండగా, గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం బాటిళ్లపై వారి వైన్ షాప్ పేరట స్టిక్కర్ వేసి అదనపు ధరలు వసూలు చేస్తూ వినియోగదారులపై ఆర్థిక భారం మోపుతున్నారని మందుబాబులు వాపోతున్నారు. బెల్ట్ షాపులో విక్రయించే మందు బాటిల్లపై...

బీఆర్ఎస్‌లో అభ్యర్థి పేర్లు ఖరారులో జాప్యం..

హన్మకొండ జిల్లా బీఆర్ఎస్‌లో విభేదాలు భగ్గుమన్నాయా?

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో నేతల మధ్య విభేదాలు..

రాకేష్ రెడ్డి ప్రసంగిస్తుండగా రంజిత్ రెడ్డి వర్గం వాకౌట్..



## కారులో తకరారు..
# ఔత్సాహికుల్లో అయోమయం..

ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 25, ప్రభాతవార్త: బీ ఆర్ ఎస్ పార్టీ అధిష్టానం ఇప్పటి వరకు వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించకపోవడం హనుమకొండ జిల్లాలో కారులో తకారుగా తయారైంది. పోటీ చేయాలని ఔత్సాహకులు ఇక్కడ ఎక్కువ మంది ఉండడం కొంత కార్యకర్తలు అయోమయానికి గురిచేస్తుంది. బీసీ నుండి మాజీ కూడా చైర్మన్ సుందరరాజుతో పాటు రాకేష్ రెడ్డి, రంజిత్ రెడ్డి, వాసు దేవా రెడ్డి తదితరులు పోటీలో ఉన్నట్టు వార్తలు ఉన్నాయి.



2వ పేజీలో...

# అధికారులారా.. బాధ్యత మరిచారా..?




కంక వనాలలో ఉన్న బోరింగ్ దగ్గర పందుల స్వైర విహారం



జంపన్న వాగు మెట్లపై చెత్త కుప్పలు..

మొదటి పేజీ తరువాయి..

ఘటనలు ప్రభాతవార్త కంటపడ్డాయి.

విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వారం రోజుల నుండి జంపన్న వాగు పరిసరాల్లో చెత్త పేరుకుపోవడం, అడవిలో నీటి ఆవాసాలు, వంట ప్రదేశాల వద్ద పందులు గుంపులు గుంపులుగా సంచరించడం భక్తులను తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గత ఐదు రోజులుగా మేడారం పరిసర ప్రాంతాల్లో ప్రభాతవార్త నిఘా టీం మేడారంలో పారిశుద్ధ్య నిర్వహణపై పట్టింపులేని అధికార యంత్రాంగం పని తీరుపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి విస్తుపోయే అనేక

**జంపన్న వాగు మెట్లపై చెత్త కుప్పలు.. అధికారుల నిర్లక్ష్యానికి సాక్ష్యాలు**

వాగు మెట్ల వద్ద ప్లాస్టిక్ సీసాలు, కవర్లు, తిన్న విస్తర్లు, ఆహార వ్యర్థాలు చెల్లాచెదురుగా కనిపిస్తున్నాయి. చెత్తను సకాలంలో తొలగించకపోవడంతో దుర్వాసనతో పాటు పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. తడి మెట్లపై భక్తులు జారిపడే ముప్పు కూడా ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. పిల్లలు, వృద్ధులు, మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిరంతర శుభ్రత, అవసరమైన రక్షణ ఏర్పాట్లు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

**నీటి ఆవాసాలు నడుమ పందుల స్వైరవిహారం..**

అడవిలో నీటి వనరుల సమీపంలో, భక్తులు వంట చేసుకునే ప్రాంతాల వద్ద పందులు సంచరిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. బహిరంగంగా పడేస్తున్న ఆహార వ్యర్థాలు పరిస్థితికి కారణమవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నీటి వనరులను కాపాడటంతోపాటు, వంట ప్రదేశాల్లో పరిశుభ్రతను పర్యవేక్షించాలని భక్తులు సూచిస్తున్నారు.

**అభివృద్ధి పనుల మధ్య అధికారుల పర్యవేక్షణ ఏదీ..?**

మేడారం గద్దెల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి పారిశుధ్యానికి అంతే ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. చెత్త కుండీలు ఏర్పాటు చేయడం, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించడం, జంపన్న వాగు మెట్లను శుభ్రం చేయడం, పందుల సంచారాన్ని నియంత్రించడం వంటి చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, డీపీవోతోపాటు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రపంచస్థాయి గుర్తింపు పొందాల్సిన పవిత్ర క్షేత్రంలో భక్తులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు అధికారులు ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచుతారా..? అన్నది వేచి చూడాలి.

**గ్రామ పంచాయతీ కార్యాలయానికి 200 మీటర్లలో కంపు కొడుతున్న చెత్త కుప్పలు**

గ్రామపంచాయతీ కార్యాలయానికి కేవలం 200 మీటర్ల దూరంలోనే ప్లాస్టిక్, ఇస్తరాకుల వ్యర్థాలు అలాగే ఉన్నాయి. రోజూ వందలాది మంది వచ్చే చోట డస్ట్ బిన్లు లేవు, పారిశుధ్య



మేడారం వనదేవతల సన్నిధిలో భక్తులు..

సిబ్బంది లేరు. భక్తుల రద్దీ ఉన్న ఈ సమయంలోనైనా జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో డిపిఓ స్పందించి జంపన్న వాగు పరిసరాల్లో పారిశుద్ధ్యం, భద్రతా చర్యలు చేపట్టాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

**పరిసరాల శుభ్రత పై అధికారులకు పట్టింపు లేదు**

**బొజ్జ సారయ్య, వనదేవతల సన్నిధికి వచ్చిన భక్తుడు, కరీంనగర్.**

35 సంవత్సరాలుగా మా కుటుంబం మేడారం వస్తుంది. ముగ్గురు ఆడపిల్లల తర్వాత పుట్టిన సారయ్య అని పేరు పెట్టారు. మా పెద్దక్క పేరు సమ్మక్క. మేడారంలో మంత్రి సీతక్క చొరవతో మంచిగా అభివృద్ధి జరిగింది. రాతితో కట్టిన తోరణాలు బాగున్నాయి. ఇన్ని కోట్లు పెట్టి కట్టిన అధికారులు ఇక్కడ శుభ్రంగా ఉంచట్లే. ఎవరికీ పట్టింపు లేదు. ఎక్కడ చూసినా చెత్త కుప్పలుకనబడుతున్నాయి.

**బోరింగ్ పంపుల చుట్టు పందుల గుంపులు తిరుగుతున్నాయి.**

**తాతోలు. విజయకుమారి, వన దేవతల సన్నిధికి వచ్చిన భక్తురాలు, విజయవాడ.**

కరోనాకు ముందు జాతరకి కుటుంబ సమేతంగా మేడారం వచ్చాం. ఆరు సంవత్సరాలకి మళ్లీ ఇప్పుడే రావడం. గద్దెలు విస్తీర్ణం చేయడంతో గుడి ప్రాంగణం విశాలంగా ఉంది. గుడివరకి బానే ఉంది. ప్రభుత్వం వేగంగా గద్దెలు విస్తీర్ణ నిర్మాణం చేయడం శుభ పరిణామం. కానీ శుభ్రత విషయానికి వస్తే ఎక్కడ కూడా సంబంధిత అధికారులు చొరవ చూపినట్టు లేదు. కంక వనాల దగ్గర మేము విడిది ఏర్పాటు చేసుకున్నాం. ఆ క్రమంలో అక్కడ గుంపులు గుంపులుగా పందులు తిరగడం, ఎప్పటినుండో వదిలేసిన ప్లాస్టిక్ ఆకులు, గ్లాసులు పచ్చని వనాల్ని కాస్త ప్లాస్టిక్ వ్యర్థాలు నిలయంగా దర్శనమిచ్చింది. సంబంధిత అటవీ శాఖ నిర్లక్ష్యానికి ఈ ఘటన అద్దం పట్టింది. జిల్లా అధికార యంత్రాంగం చొరవ చూపాలి.

# రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాట్రగడ్డ సతీష్

**అధ్యక్ష పదవికి ఒకే నామినేషన్. ఏకగ్రీవంగా ఎన్నిక**

**గతంలో పలుమార్లు అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం**



**ములుగు జిల్లా బ్యూరో ప్రభాతవార్త అక్టోబర్ 25:**

రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పసర గ్రామానికి చెందిన కాట్రగడ్డ సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నికల అధికారి ఏకగ్రీవ ఎన్నికను ప్రకటించారు. గతంలో పలుమార్లు అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఉన్న సతీష్‌కు మరోసారి బాధ్యతలు దక్కడం ప్రాధాన్యం సంతరించుకుంది. సంఘం కార్యకలాపాలపై అవగాహన, మిల్లర్ల సమస్యలపై అనుభవం ఆయనకు కలిసివచ్చినట్లు భావిస్తున్నారు. రైస్ మిల్లుల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, మిల్లర్ల సమస్యల పరిష్కారం, సంబంధిత శాఖలతో సమన్వయం చేయడంలో అసోసియేషన్ కీలక పాత్ర పోషించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సతీష్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. మిల్లర్ల ప్రయోజనాలను కాపాడుతూ, సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు, సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత ఆయనపై ఉంది.

# స్టిక్కర్ల మాటున లిక్కర్ అక్రమ వ్యాపారం!

మొదటి పేజీ తరువాయి..



ఓ ప్రత్యేకమైన స్టిక్కర్ ఉండటం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఈ స్టిక్కర్ ఉన్న మందు బాటిల్ల బెల్ట్ షాపుల నిర్వాహకులపై అధికారులు ఎలాంటి తనిఖీలు, దాడులు చేయకపోవడం వెనుక పెద్ద గూడుపుఠాని ఉందని ప్రజలు అనుకుంటున్నారు.

**బాటిల్‌పై రూ.40 అదనపు వసూలు?**

మండల కేంద్రంలోని వైన్ షాపుల నుంచి గ్రామాల్లోని బెల్ట్ షాపులకు మద్యం సరఫరా అవుతున్న క్రమంలో, ఒక్కో బాటిల్‌పై రూ.20 అదనంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. దీనికి బెల్ట్ షాపుల నిర్వాహకులు మరో రూ.20 కలిపి, ఒక్కో బాటిల్‌పై మొత్తం రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో మద్యం కొనుగోలుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**18 గ్రామాల్లో బెల్ట్ షాపులు?**

ఎల్కతుర్తి మండల పరిధిలో మొత్తం 20 గ్రామాలు ఉండగా, వాటిలో రెండు గ్రామాల్లో మద్యం నిషేధం అమల్లో ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. మిగిలిన 18 గ్రామాల్లో సుమారు 150 బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ సంఖ్య, మద్యం విక్రయాల తీరు, అదనపు వసూళ్లపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**అధికారులు స్పందించాలి**

మద్యం విక్రయాల్లో నిబంధనలు పాటిస్తున్నారా? బెల్ట్ షాపుల పేరుతో అనధికారిక విక్రయాలు జరుగుతున్నాయా? బాటిళ్లపై నిర్ణీత ధరకు మించి వసూలు చేస్తున్నారా? అనే అంశాలపై ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వినియోగదారులు కోరుతున్నారు. గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేసి, అధిక ధరల వసూళ్లపై తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

మద్యం అక్రమ వ్యాపారంపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# కారులో తకరారు.. ఔత్సాహికుల్లో అయోమయం..




మొదటి పేజీ తరువాయి..

**ఎవరికి వారే యమునా తీరుగా**

తమ తమ వర్గంతో బరిలో నిలుచడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయా? వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం వేదికగా నేతల మధ్య విభేదాలు బయటపడ్డాయనే చర్చ రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆదివారం హనుమకొండలో హాజరైన ఒక సమావేశంలో నేతల మధ్య కనిపించిన దూరం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. సమావేశంలో రాకేష్ రెడ్డి మాట్లాడుతున్న సమయంలో దుగ్గింపూడి రంజిత్ రెడ్డి వర్గానికి చెందిన నేతలు, కార్యకర్తలు సమావేశాన్ని బహిష్కరించి బయటకు వచ్చినట్టు సమాచారం. రంజిత్ రెడ్డి సమావేశం నుంచి బయటకు రావడంతో ఆయన వెనుకే వందలాది మంది కార్యకర్తలు బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో కొద్దిసేపటి క్రితం వరకు కార్యకర్తలతో సందడిగా ఉన్న సభా ప్రాంగణం ఒక్కసారిగా ఖాళీ అయినట్లు సమాచారం. ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ నేతలు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన సమయంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ ముఖ్య నేతల సమక్షంలోనే ఇలాంటి పరిస్థితి నెలకొనడం బీఆర్ఎస్ శ్రేణుల్లో చర్చకు దారితీస్తోంది. ఎన్నికల వేళ నేతల మధ్య అసంతృప్తికి కారణాలేంటి? పార్టీ అంతర్గత విభేదాలు ఎన్నికల సన్నాహాలపై ప్రభావం చూపనున్నాయా? ఈ పరిణామాలపై పార్టీ అధిష్ఠానం ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# నెక్కొండలో 12 కిలోల
# ఎండు గంజాయి పట్టివేత

**- రూ.6 లక్షల విలువైన గంజాయి స్వాధీనం**

**- మహారాష్ట్రకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ అరెస్ట్**

**- ఒడిశా నుంచి కొనుగోలు చేసి మహారాష్ట్రలో విక్రయించేందుకు తరలింపు..**

**- మరో ముగ్గురు సెల్‌ఫోన్లు స్వాధీనం**

నెక్కొండ, అక్టోబర్ 25, ప్రభాతవార్త:



నెక్కొండ మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో పోలీసులు 12 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడనే అనుమానంతో మహారాష్ట్రకు చెందిన నితిన్ న్యాను షిండేను పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి సుమారు రూ.6 లక్షల విలువైన ఎండు గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు నెక్కొండ ఎస్సై శ్రావణ్ కుమార్ వెల్లడించారు.

**- పెట్రోలింగ్‌లో పట్టుబడిన నిందితుడు...**

నెక్కొండ ఎస్సై శ్రావణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బస్టాండ్ సమీపంలో




ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులను గమనించిన అతడు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించడంతో అప్రమత్తమైన పోలీసులు అతడిని వెంబడించి పట్టుకున్నారు. అనంతరం అతడిని విచారించి తనిఖీలు నిర్వహించగా, అతడి వద్ద 12 కిలోల ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

**- ఒడిశా నుంచి మహారాష్ట్రకు రవాణా...**

పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. నిందితుడు మహారాష్ట్రకు చెందిన నితిన్ న్యాను షిండేగా గుర్తించారు. అతడు మహారాష్ట్రలో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని కొనుగోలు చేసి, మహారాష్ట్రకు తరలించి అక్కడ అధిక ధరకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో నెక్కొండ బస్టాండ్ సమీపంలో పోలీసులకు పట్టుబడినట్లు వెల్లడించారు.

**- రూ.6 లక్షల విలువైన గంజాయి స్వాధీనం....**

నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న 12 కిలోల ఎండు గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.6 లక్షలు ఉంటుందని ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? రవాణా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? ఈ వ్యవహారంలో ఇతర వ్యక్తుల ప్రమేయం ఏమైనా ఉందా? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కేశిరెడ్డిపల్లిలో విద్యుత్‌స్తంభాల ఏర్పాటు

**- హర్షం వ్యక్తంచేసిన కాలనీవాసులు**

బచ్చన్నపేట, అక్టోబరు 25 ప్రభాతవార్త :

కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్న విద్యుత్‌స్తంభాల సమస్య ఎట్టకేలకు పరిష్కారం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. గ్రామసర్పంచ్ ఆరె రవికుమార్, ఉపసర్పంచ్ చింతల రాజిరెడ్డి సహకారంతో విద్యుత్‌స్తంభాల ఏర్పాటు పూర్తికావడంతో తమసమస్య తీరిందని కాలనీవాసులు సంతోషం వ్యక్తంచేశారు. దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి సహకరించిన సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలసమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషిచేయడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యుత్‌స్తంభాల ఏర్పాటుద్వారా కాలనీలో విద్యుత్ సదుపాయానికి సంబంధించిన ఇబ్బందులు తొలగుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవికుమార్ మాట్లాడుతూ ఇచ్చినమాట ప్రకారం గ్రామంలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కేశిరెడ్డిపల్లిలో బండమీద ఏరియాలో అక్కడున్న ప్రజలు కొన్నేళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. వెంటనే త్వరితగతిన విద్యుత్‌స్తంభాల ఏర్పాటుచేసి వారిసమస్య తీరేవిధంగా కృషిచేశామన్నారు. ఈ విద్యుత్‌స్తంభాల నిర్మాణపనులకు సహకరించిన బచ్చన్నపేట ఏఈ రాజ్‌కుమార్, లైన్‌మెన్ శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ లైన్‌మెన్ పర్శారాములు, విద్యుత్‌సిబ్బంది ఆంజనేయులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యదండ్ల విజయ భాస్కర్‌గౌడ్, గ్రామపంచాయతీ సిబ్బంది రాజేష్, నర్సింహులు, భాస్కర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



## విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

ఖానాపురం, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

విద్యుత్ షాక్‌తో మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని గొల్లగూడెంతండాలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రామ్మోహన్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వారికున్న చెలకలో నీళ్లు పారించే క్రమంలో విద్యుత్ మోటర్ ఆన్‌చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై గుడితండాకు చెందిన భూక్య మంగమ్మ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడికే మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి కొడుకు, కూతురు ఉన్నట్లు సమాచారం.



## ఇంటర్ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్య

జనగామ టౌన్, అక్టోబరు 25 ప్రభాతవార్త :

ఓ ఇంటర్ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జనగామ జిల్లాకేంద్రంలోని బతుకమ్మ కుంట ప్రాంతంలో నెలకొంది. సంఘటనకు సంబంధించి మృతురాలు తండ్రి బానోతు క్రాంతికుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... జనగామ జిల్లాకేంద్రంలోని బతుకమ్మ కుంటలో నివాసం ఉంటున్న బానోతు క్రాంతికుమార్ కుమార్తె కార్తి నాయక్(16) హైదరాబాద్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుందని, దసరా సెలవులసందర్భంగా ఇంటికి రాగా,తిరిగి ఈనెల 25వ తేదీ (ఆదివారం) వెళ్ళాల్సిందని, కానీ ఉదయం లేచి చూసేసరికి బెడ్‌రూం తలుపులు వేసి ఉన్నాయని, అనుమానంతో కిటికిలోనుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. దీంతో పక్కవారి సహాయంతో తలుపులు తెరిచి కుమార్తెను వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలియచేశారు. తమ కుమార్తె విషయంలో ఎవరిపై అనుమానాలు లేవని పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. దీంతో పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నేరాలు-దారుణాలు

## అదనపు కట్నం వేధింపులకు వివాహిత బలి

**- క్రిమిసంహారక మందు తాగి వివాహిత ఆత్మహత్య**

**- 5 గురి పై కేసు నమోదు**

చిట్యాల, అక్టోబర్ 25 ప్రభాతవార్త:



పెద్దలు కుదిర్చిన సంబంధం. ముహూర్తం ప్రకారం మూడు ముళ్ళు ఆరడుగులు వేసి జీవితాంతం తోడుగా ఉంటానని భాస చేసి వివాహం జరిగే మూడేళ్ల గడిచాక అదనపు వరకట్నం కావాలంటూ భర్త అతని కుటుంబ సభ్యులు చేసిన వేధింపులు తట్టుకోలేక వివాహిత క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.హన్మకొండ జిల్లా, శాయంపేట మండలం, పత్తిపాక గ్రామానికి చెందిన కొడిమాల మహేందర్ తన కుమార్తె కావ్యను ములుగు జిల్లా, అమ్మవారిపేటకు చెందిన మల్లెబోయిన రామకృష్ణకు ఇచ్చి 23 నవంబర్ 2023న వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో అల్లుడి డిమాండ్ మేరకు ములుగులో ఉన్న 10 లక్షల విలువగల ప్లాట్ స్థలంతో పాటు 2 తులాల బంగారం, నగదును కట్నంగా వచ్చారు. వీరి దాంపత్య జీవితానికి 2 ఏళ్ల పాప ఉంది. ఈ క్రమంలో గత కొంతకాలంగా కావ్యను అదనపు కట్నం కింద మరో రూ 10 లక్షల రూపాయలు తీసుకురావాలని భర్త రామకృష్ణ, అత్త సమ్మక్క, మామ మొగలి, బావ రాజశేఖర్, ఆడపడుచు నిర్మలలు మానసిక, శారీరక వేధింపులకు గురిచేస్తూ వచ్చారు. గత 6 నెలలుగా దంపతులు చిట్యాలలో అద్దెకు ఉంటున్నప్పటికీ, అత్తగారింటి వారి ప్రోత్సాహంతో వేధింపులు తీవ్రంగా కొనసాగాయి. ఇటీవల దసరా పండుగ రోజున కావ్య, రామకృష్ణ పుట్టింటికి వచ్చిన సమయంలో కూడా, 10 లక్షల అదనపు కట్నం ఇస్తేనే పంపుతానని భర్త బెదిరింపులకు దిగాడు. అనంతరం చిట్యాలకు వెళ్లిన తర్వాత కూడా అదనపు కట్నం తెమ్మంటూ, చావక ఇక్కడెందుకు ఉన్నావ్ అని కొట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురైన కావ్య, ఈనెల 24న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. చికిత్స నిమిత్తం పరకాలలోని ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుండి వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో ఆదివారం కావ్య మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

## నర్సంపేట మున్సిపల్ కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం

నర్సంపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త:



పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఆదివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో లక్ష్మిఆటోమొబైల్, హక్ ఫార్మసీ సర్వీస్ సెంటర్ (ఫర్టిలైజర్) దుకాణాలు మంటల్లో చిక్కుకుని దగ్ధమయ్యాయి. తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో దుకాణాల్లోని సామగ్రి అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో మంటలు ఇతర దుకాణాలకు వ్యాపించకుండా అడ్డుకోగలిగారు. ఈ అగ్నిప్రమాదంలో లక్ష్మిఆటోమొబైల్ యజమాని శరత్, హక్ ఫార్మసీ సర్వీస్ సెంటర్ యజమాని రమేష్‌కు భారీ ఆస్తినష్టం వాటిల్లింది. ప్రమాదం కారణంగా సుమారు రూ.80 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత దుకాణాల యజమానులు తెలిపారు.ఉదయం వేళ జరిగిన ఈ ఘటనతో మున్సిపల్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు.

## చైర్మన్ ను పరామర్శించిన రామగుండం మేయర్

**రామగిరి ప్రభాతవార్త**

కమాన్ పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజును, అలాగే ఆయన సోదరుడు హనుమకొండ ప్రభుత్వ గవర్నమెంట్ ప్లీడర్ ను రామగుండం మేయర్ మహంకాళి స్వామి మంథని మున్సిపల్ చైర్మన్ వద్నాల శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. గత నాలుగు రోజుల క్రితం వైనాల రాజు తండ్రి వై నాల సాంబయ్య మృతిచెందగా సాంబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సాంబయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.వీరితో పాటు, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ పేరాల మహేశ్వరరావు,ముస్యాల సర్పంచ్ సుంకరిమహేందర్, వందనాపూర్ సర్పంచ్ కొండ మంజుల శ్రీనివాస్, కాంగ్రెస్ జీడి నగర్ మాజీ సర్పంచ్ సూరా సమ్మయ్య బసంత నగర్ యూనియన్ కార్మిక సంఘం అధ్యక్షులు జిల్లా ప్రధాన కార్యదర్శి.. టిపిసిసి నాయకులు శ్రీనివాసు రామగుండం కార్పొరేటర్లు మారెల్లి రాజిరెడ్డి నాయకులు దశరథం బండ రమేష్ రెడ్డి మంథని వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి కౌన్సిలర్లు ఎల్లంకి వంశీ గుండా రాజు జంబోజు సమ్మయ్య ఎరుకల లింగయ్య, మంతిని సిసిఎల్ అధ్యక్షులు మంతిని సత్యం, జనగామ కృష్ణ పెద్దపల్లి జిల్లా డిఆర్డిఏ సీసీలు గుండారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచులు ఆకుల ఒదేలు, పిడుగు నరసయ్య గ్రామ శాఖ అధ్యక్షులు పిడుగు శంకర్ ఉప సర్పంచ్ రాజేందర్ వార్డు సభ్యులు దేవన్న, సీనియర్ నాయకులు హర్ష ఎల్లయ్య ముద్దాం కొమురయ్య మంథని నాయకులు పూదరి సర్వేష్ , బూడిద లింగన్న ఆకుల సత్యం హనుమకొండ అడ్వకేట్ అసోసియేషన్ నాయకులు బొల్లెపల్లి లక్ష్మణ్ , బొల్లెపల్లి కుమార్ , గొల్లపల్లి సాయి రాచకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## పోలీసు అమరవీరుల ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత

**ముత్తారం ఎస్ ఐ ఎన్. రవికుమార్**

**పోలీస్ అమరవీరులకు నివాళిగా కొవ్వొత్తుల ర్యాలీ**

**ముత్తారం, ప్రభాతవార్త:**

పోలీస్ అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ముత్తారం ఎస్ ఐ ఎన్.రవికుమార్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం కాసర్లగడ్డ సెంటర్ నుంచి సరస్వతి స్కూల్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో దాదాపు 50 మంది పాల్గొని, విధి నిర్వహణలో దేశ సేవకు, ప్రజల రక్షణకు తమ ప్రాణాలను అర్పించిన పోలీస్ అమరవీరులను స్మరించుకున్నారు. వారి త్యాగాలు, సేవలు, అంకితభావం సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజల భద్రతతో పాటు శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసులు చేస్తున్న కృషిని గుర్తుచేస్తూ, అమరవీరుల లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ ర్యాలీలో ముత్తారం పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.




## వట్టెంల సర్పంచ్ కౌంటర్.. బీఆర్ఎస్ ఆరోపణలు అవాస్తవం

**పోలీస్ రికార్డులతో ఆరోపణలను ఖండించిన రంగు వెంకటేష్**

**వేములవాడ రూరల్ ప్రభాతవార్త**

వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలను సర్పంచ్ రంగు వెంకటేష్ తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు తమపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు.సంబంధిత వ్యక్తులపై 2023 అక్టోబర్ 14న బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కేసులు నమోదై, రౌడీషీట్లు తెరిచినట్లు పోలీసు రికార్డులను చూపిస్తూ వివరించారు. రాజకీయ ఉనికి కోసమే తమపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.గ్రామంలో ప్రశాంత వాతావరణాన్ని కొనసాగిస్తూ, పారదర్శక పాలనతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే తమ లక్ష్యమని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి సహకరించాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు.



## బీజేపీ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

**బీజేపీ పార్టీ నాయకులు ఆకుల రాజేందర్**

**బోయిన్ పల్లి ప్రభాత వార్త**

భారతీయ జనతా పార్టీ బోయిన్పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ గ నాయకత్వంలో బోయిన్పల్లి మండలంలోని పలు గ్రామాల్లో శక్తి కేంద్రాల వారిగా టిఫిన్ బైఠక్ నిర్వహించారు. విలాసాగర్ గ్రామంలో నిర్వహించిన టిఫిన్ బైఠక్ కార్యక్రమంలో ఆకుల రాజేందర్ పాల్గొన్నారు..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆకుల రాజేందర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ, పార్టీ సంస్థాగత బలోపేతం, గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం, నాయకులు కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం టిఫిన్ బైఠక్ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఇటువంటి సమావేశాలు దోహదపడతాయని తెలిపారు.అదేవిధంగా, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో నిర్వహించనున్న యువకుల ర్యాలీని విజయవంతం చేసేందుకు బోయిన్పల్లి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేస్తూ ర్యాలీ విజయవంతానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా నాయకులు సతీష్ కుమార్, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ బొంగానే అశోక్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు మెరుపుల గంగాధర్ గౌడ్, రాజేంద్రప్రసాద్, మండల ఉపాధ్యక్షులు ఇల్లందుల బాలయ్య, మోహన్ బాబు, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు సుంకపాక ప్రభు, యువ మోర్చా మండల అధ్యక్షులు మిరియాల శరత్ చంద్ర రెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు తిప్పర వేణి శ్రీనివాస్, మండల కార్యదర్శి మెనుకుల శ్రీనివాస్, సీనియర్ నాయకులు మారం ఉపేందర్, సొరంపల్లి రాజు, మండల సోషల్ మీడియా కన్వీనర్ భాస్కర్ రెడ్డి, రేగుల రమేష్, బూర మనోజ్, నాగుల అనిల్, చల్ల కిరణ్, గొంటి రమేష్, వెన్నంపల్లి మహేష్, వెన్నంపల్లి అనిల్, మెరుగు రమేష్, మునిపాల సాగర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కాటారం వార్త

## ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తే ప్రజలు నమ్మరు

- ఎన్నికల్లో గెలవడానికే భారాస కుట్రలు, ఎత్తుగడలు
- లక్షల కోట్ల ప్రజాధనం దోచుకోవడానికే కాళేశ్వరం నిర్మాణం
- కరువులోనూ రైతులకు అండగా రూ. 50 కోట్లు
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**భూపాలపల్లి, అక్టోబర్ 25, ప్రభాతవార్త:** ప్రజా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, అబద్ధాలతో మళ్లీ అధికారంలోకి రావాలని భారాస నాయకులు అనేక కుట్రలు, ఎత్తుగడలు వేస్తున్నారని, అయితే వారి మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పష్టం చేశారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా ఎల్నినో ప్రభావం కారణంగా తీవ్ర కరువు పరిస్థితులు నెలకొంటే, ఈ కరువును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెచ్చిన కరువంటూ భారాస నేతలు దుర్మార్గమైన ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి విషయాన్ని రాజకీయం చేస్తూ, అబద్ధాన్ని వందసార్లు చెప్పి నిజం చేయాలని భారాస నేతలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రెండు రోజుల క్రితం జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్‌లను భారాస ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు సందర్శించి ఖీనీళ్లున్నా ఎందుకు ఎత్తిపోయడం లేదు?ఖీ అని ప్రశ్నించడం సిగ్గుచేటన్నారు.లక్షలాది కోట్ల ప్రజాధనాన్ని దోచుకోవడానికే భారాస హయాంలో అక్కడ ప్రాజెక్టును నిర్మించారని, సాగునీటిపారుదల శాఖ నిపుణులు సూచించిన ప్రదేశంలో కాకుండా తమ స్వార్థం కోసం వేరే ప్రాంతానికి ప్రాజెక్టును మార్చడానికి కారకులు ఎవరని నిలదీశారు. జిల్లా నుంచే గోదావరి నీటిని దూరప్రాంతాలకు తరలించడానికి పంప్‌హౌస్‌లు నిర్మించి, కనీసం ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాలకు ఒక్క సాగునీటి చుక్కను కూడా అందించకుండా, నేడు ప్రజా ప్రభుత్వంపై బురద చల్లడానికే ఇలాంటి సందర్శనలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో త్వరలోనే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీపై ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మరన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడిన కరువు పరిస్థితుల్లో రైతులకు, ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, సహాయక చర్యల కోసం ప్రతి నియోజకవర్గానికి రూ.50 కోట్ల వరకు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, పురపాలక సంఘం చైర్మన్ కొమురయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు దాట్ల శ్రీనివాస్, నాయకులు చల్లూరి సమ్మయ్య, రామినేని రవీందర్, ఇస్లావత్ దేవన్, ఖ్యాతం సాంబమూర్తి, మహేందర్, శారద, రవి తదితరులు పాల్గొన్నారు.



## నేడు సామూహిక లక్షబిల్వార్చన

- ఈవో చిందం వంశీ

**బచ్చన్నపేట, అక్టోబరు 25 ప్రభాతవార్త :** సిద్ధులగుట్ట సిద్ధేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 26న సోమవారం సామూహిక లక్షబిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చిందం వంశీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ పంచభూతనాథ సంప్రదాయ ఆశ్రమం ఆధ్వర్యంలో ఉదయం 11గంటలకు పూజాకార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. శివారాధనలో బిల్వదళాలకు విశేష ప్రాధాన్యత ఉందని, స్వామివారికి బిల్వదళాలతో అర్చనచేయడం పవిత్రమైనదని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే సామూహిక లక్షబిల్వార్చనలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.1,116 చెల్లించి తమపేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆలయ ఈఓ చిందం వంశీ విజ్ఞప్తి చేశారు.

## నేడు ప్రజావాణి కార్యక్రమం

సుబేదారి అక్టోబర్ 25 (ప్రభాతవార్త):

జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి అర్జీల స్వీకరప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో, హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తీవ్ర నీటి సంక్షోభం !

- నీటిని పొదుపు చేయడమే కాదు.. ప్రతి ఒక్కరూ చెట్టును నాటండి
- భవిష్యత్ తరాల మనుగడ కోసం ఇప్పటి నుంచే మేల్కోవాలి
- కుంకుమేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు



పరకాల అక్టోబర్ 25 (ప్రభాతవార్త): వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం, భూగర్భ జలాల విచ్చలవిడిగా వినియోగం వంటి పరిణామాలు భవిష్యత్తులో మానవ మనుగడకు సవాలుగా మారే ప్రమాదం ఉందని పరకాల శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్, పరకాల ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ సీడ్స్ అసోసియేషన్ వెల్ఫేర్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం తగ్గడం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం వంటి పరిస్థితులు ఏర్పడితే నీటి కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.తాగునీటి కోసం అల్లాడే పరిస్థితులు రాకుండా ఇప్పుడే చర్యలు తీసుకోవాలన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని వృథా చేయవద్దంటూ ప్రభుత్వం, అధికారులు చేస్తున్న ప్రచారం అభినందనీయమని గందె వెంకటేశ్వర్లు అన్నారు.ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కల్పించడంతోపాటు, భవిష్యత్తులో నీటి లభ్యత పెరిగేలా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు.రానున్న తరాలకు తాగునీరు అందుబాటులో ఉండాలంటే ఇప్పటి నుంచే వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, చెట్ల పెంపకం వంటి చర్యలను ప్రజా ఉద్యమంగా మార్చాలని కోరారు. లేకపోతే భవిష్యత్తులో పట్టణాలు, గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు.చెట్లు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో, కార్బన్ డైఆక్సైడ్‌ను గ్రహించడంలో, నేల కోతను తగ్గించడంలో, నీరు నేలలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితులు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. అయితే చెట్లు నాటడం ఒక్కటే వర్షాలకు హామీ కాదని, నీటి సంరక్షణతో పాటు సమగ్ర పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రతి ఇంటి ఆవరణలో, ప్రతి పాఠశాలలో, అవకాశం ఉన్న ప్రతి కొత్త భవన ప్రాంగణంలో కనీసం ఒకటి లేదా రెండు మొక్కలు నాటి, వాటిని సంరక్షించే విధానాన్ని ప్రోత్సహించాలని గందె వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## నేటి మహాధర్నాను జయప్రదం చేయండి

పాలకుర్తి, అక్టోబరు 25 ప్రభాతవార్త : కార్మికుల హక్కులపరిరక్షణ, సామాజికభద్రత సాధనకోసం ఈనెల 26న హైదరాబాదులోని ఇందిరా పార్కువద్ద నిర్వహించనున్న మహాధర్నా కార్యక్రమంలో హమాలీ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు మండలనాయకులు పెండ్లి భాస్కర్, అంబటి సోమయ్య, ఏనుగతల వెంకన్న, జి.కుమార్ పిలుపునిచ్చారు. పాలకుర్తి మండలకేంద్రంలో గుడివాడ చౌరస్తాలో హమాలీకార్మిక సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ కార్యక్రమం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మికవ్యతిరేక విధానాలు ఐక్యంగా తిప్పికొట్టాలని, నాలుగు లేబర్‌కోడ్స్ రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో అంబటి సోమయ్య, ఏనుగతల వెంకన్న, ఎడవల్లి కుమార్, సమ్మన్న, కలీం, సారయ్య, మైబు, జి.ఎల్లయ్య, షేర్ సమ్మయ్య, దండు కృష్ణ, ఫరీదు, ఏ.రాజు, అశోక్, ఉప్పన్న తదితరులు పాల్గొన్నారు.



## "పల్లె వెలుగు"లో ఎక్స్‌ప్రెస్ బోర్డులు

- ప్రయాణికులపై చార్జీల భారం
- బిజీ రూట్లలోనే అంటున్న అధికారులు

(పరకాల ప్రభాతవార్త):

పరకాల,భూపాలపల్లి ఆర్టీసీ తీరు విమర్శలకు తావిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు ఆయా బస్సుల బోర్డులు మారుస్తూ ప్రయాణికుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. ఆర్డినరీ సర్వీసులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు తగిలించి అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు. ఈ మేరకు ఆ శాఖ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### - నిబంధనలు తుంగలో తొక్కుతూ...

పల్లె వెలుగు బస్సులను ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు నడుపుతుంటారు. ఇవి ప్రతి రిక్వెస్ట్ స్టాప్ వద్ద ఆగుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తుంటాయి. ఎక్స్‌ప్రెస్‌తో పోలిస్తే వీటి చార్జీలు తక్కువ. అలాగే సీట్ల సౌకర్యం, వేగం విషయంలోనూ భేదం ఉంటుంది. అయితే ప్రస్తుతం అధికారులు ఈ బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డు తగిలించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. అధికారుల తీరుతో అదనపు భారం పడుతోందని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

### - డిపోలో బస్సుల కొరతే ప్రధాన కారణమా?..

డిపోలో సరిపడా బస్సులు లేకపోవడం, మరమ్మతులకు గురైన వాహనాలు రోడ్డెక్కకపోవడం, ఉన్న కొన్ని బస్సులను ఇతర రూట్లకు మళ్లించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని సమాచారం. అధికారులు అందుబాటులో ఉన్న ఏ బస్సుకు ఏ బోర్డు ఉంటే అది పెట్టి నడిపిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగాయని, అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. రవాణా రంగంలో ప్రయాణికుల విశ్వాసమే ప్రధానమని, ఇలాంటి నిర్లక్ష్య చర్యలు ఆర్టీసీ ప్రతిష్టను మసకబారుస్తున్నాయని పలువురు మేధావులు హెచ్చరిస్తున్నారు. తక్షణమే జిల్లా ఆర్టీసీ అధికారులు పరకాల డిపోపై దృష్టి సారించాలని, బస్సుల కొరతను తీర్చడంతో పాటు, ప్రతి బస్సుకు సరైన డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేసి ప్రయాణికుల గందరగోళాన్ని నివారించాలని డిమాండ్ చేస్తున్నారు.




### - గ్రామాలకు తగ్గుతున్న బస్సులు..

గ్రామీణ ప్రాంతాలకు నడిచే పల్లె వెలుగు కంటే హైఎండ్ బస్సుల ద్వారా ఆర్టీసీకి ఆదాయం అధికంగా వస్తుంది. నిత్యం రద్దీగా ఉండే పట్టణ మార్గాల్లో ప్రతి 5 నుంచి 10 నిమిషాలకోసారి బస్సులను ఆపరేట్ చేస్తుంటారు. అయితే ఎన్ని నడిపినా ట్రాఫిక్ తగ్గడం లేదని భావించిన అధికారులు బిజీ రూట్లలో తిరిగే ఆర్డినరీ సర్వీసులకు ఎక్స్‌ప్రెస్ బోర్డు తగిలిస్తున్నారు. తద్వారా పల్లె వెలుగు సర్వీసుల సంఖ్య తగ్గి గ్రామీణ ప్రాంత ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో తమ గ్రామాలకు రోజుకు రెండు, మూడు ట్రిప్పులు నడిచిన బస్సులు ప్రస్తుతం ఒక్క ట్రిప్పుకే పరిమితమైనట్లు పేర్కొంటున్నారు. ఫలితంగా బస్సు కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### - అధిక చార్జీల భారమిలా..

పరకాల నుంచి జిల్లా కేంద్రం హన్మకొండ కు ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రూట్‌లో పల్లె వెలుగులో రూ.50 చార్జీ ఉండగా, ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్ పేరిట ఈ సర్వీసులకే రూ.60 వసూలు చేస్తుండడం గమనార్హం. ఇలా ఒక్కో ప్రయాణికుడిపై రూ.10 భారం పడుతోంది. ఈ క్రమంలో అధికారుల తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## పట్టభద్రులూ.. ఓటు నమోదు చేసుకోండి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి పట్టభద్రుడు ఓటు హక్కు వినియోగించుకోవాలి
- కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలి
- టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ మడికొండ శీను

పరకాల అక్టోబర్ 25(ప్రభాతవార్త):

వరంగల్ -ఖమ్మం -నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని తన ఓటు హక్కును వినియోగించుకోవాలని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ మడికొండ శీను పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన నివాసంలో పట్టభద్రుల ఓటు నమోదు పరిశీలనకు వచ్చిన బిఎల్ఓ కు వివరాలను అందజేశారు, ఈ సందర్భంగా మడికొండ శీను మాట్లాడుతూ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనేందుకు తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామి కావాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన ధ్రువపత్రాలతో ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఓటు నమోదు విషయంలో నిర్లక్ష్యం చేయకుండా, తమతో పాటు ఇతర అర్హులైన పట్టభద్రులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. వరంగల్ -ఖమ్మం -నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి పట్టభద్రుడు చురుకుగా పాల్గొని ప్రజాస్వామ్యబద్ధంగా తన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కట్టుబడి, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను ఆయన విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమం, యువత అభ్యున్నతి, విద్యావంతుల ఆకాంక్షల సాధనకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. పట్టభద్రుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేసే అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.ప్రజాసేవకు, కాంగ్రెస్ పార్టీకి అంకితమైన త్యాగాల కుటుంబానికి చెందిన రాంరెడ్డి సర్వోత్తం రెడ్డికి ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సర్వోత్తం రెడ్డి విజయాన్ని ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త తమ వ్యక్తిగత బాధ్యతగా భావించి పనిచేయాలని అన్నారు.



## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె 3వ రోజు డాక్టర్ ఎం. ఎల్లయ్య సంఘీభావం

సుబేదారి అక్టోబర్ 25 ప్రభాతవార్త:

ఎన్ హెచ్ ఎం జేఏసీ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె నేడు 13వ రోజుకు చేరుకుంది.ఆదివారం సమ్మె శిబిరానికి డాక్టర్. ఎం. ఎల్లయ్య గారు (డిపిఎమ్ఓ ), తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు విచ్చేసి ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల పోరాటానికి సంఘీభావం తెలిపారు.డాక్టర్ ఎం. ఎల్లయ్య (డిపిఎమ్ఓ) మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారు చెప్పిన సమానత్వం, సామాజిక న్యాయం ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు కూడా వర్తించాలని, ఎన్నో సంవత్సరాలుగా తక్కువ వేతనానికి, ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా పని చేస్తున్న ఎన్ హెచ్ ఎం. ఉద్యోగులకు న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఈ రోజు కి 13 రోజులు గడుస్తున్న కూడా ప్రభుత్వం స్పందించకపోవడం చాలా బాధాకరమన్నారు.అలాగే అంబేద్కర్ యువజన సంఘం తరపున ఎన్ హెచ్ ఎం పోరాటానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లైన రెగ్యులరైజేషన్, ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం, 180 రోజుల ప్రసూతి సెలవు లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం జేఏసీ ఫౌండర్ డాక్టర్ మహేందర్ పుట్ట కూడా పాల్గొని, ఉద్యోగులకు దిశానిర్దేశం చేస్తూ, డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నిత్యం జేఏసీ హనుమకొండ జిల్లా నాయకులు, వివిధ కేడర్లకు చెందిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు పాల్గొన్నారు. డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగుతుందని జేఏసీ నాయకులు తెలిపారు.నిరసనలో పాల్గొన్నవారు: రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుక్ముద్దీన్, రాష్ట్ర కోశాధికారి నరేష్, ఎన్ హెచ్ ఎం జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సభ్యులు, డా. అభినందన్ రెడ్డి, చంద్రమౌళి, నరేష్, సంతోష్, ఎన్ హెచ్ ఎం జిల్లా నాయకులు, వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్స్, తదితరులు పాల్గొన్నారు.

# ములుగు రైస్ మిల్ అసోసియేషన్ ఎన్నికల్లో హైడ్రామా..!

అరెస్టులు.. నామినేషన్ ఉపసంహరణ... ఏకగ్రీవ ఎన్నిక..

బాదం ప్రవీణ్ అరెస్ట్ వ్యవహారంపై రాజకీయ చర్చ.

సతీష్ ఎన్నికతో బాణసంచా సంబరాలు..

**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాతవార్త:**

ములుగు జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికలు ఆదివారం నాటకీయ పరిణామాల మధ్య ముగిశాయి. ఉదయం అరెస్టులు.. మధ్యాహ్నం పోలీసుల కదలికలు.. నామినేషన్ ఉపసంహరణ.. చివరకు ఏకగ్రీవ ఎన్నిక.. అనంతరం బాణసంచా సంబరాలు.. ఇలా వరుస పరిణామాలు జిల్లాలో రాజకీయ చర్చకు తెరలేపాయి. గతంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసిన బాదం ప్రవీణ్ చుట్టూ చోటుచేసుకున్న పరిణామాలు, కాట్రగడ్డ సతీష్ ఏకగ్రీవ అంశాలపై రాజకీయ కోణాలున్నాయనే ప్రచారం జరిగింది.

**బాదం ప్రవీణ్ అరెస్టుతో మొదలైన గందరగోళం..**

అక్టోబర్ 25న అధ్యక్ష ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఉదయం బాదం ప్రవీణ్‌తో పాటు మరో ఆరుగురు రైస్ మిల్లర్లను సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. మిల్లుల్లో బియ్యం అక్రమ నిల్వలపై విచారణ అనే ప్రచారంతో ఎన్నికల రోజే ఈ పరిణామం చోటుచేసుకోవడంతో మిల్లర్లు, జిల్లాలో ఉత్కంఠ నెలకొంది. అరెస్టులకు సంబంధించిన కారణాలు, ఎన్నికలతో వాటికి ఏమైనా సంబంధం ఉందా...? అనే అంశాలపై చర్చ మొదలైంది. అయితే, ఈ పరిణామాల వెనుక రాజకీయ ఉద్దేశాలున్నాయనే ప్రచారానికి సంబంధించి అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు.

**ఎన్నికల ప్రాంగణానికి ప్రవీణ్.. ఆపై నామినేషన్ ఉపసంహరణ**

అరెస్టుల అనంతరం మధ్యాహ్నం బాదం ప్రవీణ్‌తో పాటు మరికొందరిని పోలీసులు ఎన్నికలు జరిగే ప్రదేశానికి తీసుకువచ్చారు. దీంతో ప్రవీణ్ అధ్యక్ష పదవికి పోటీలో కొనసాగుతారా? అనే ఉత్కంఠ నెలకొంది. అయితే, చివరకు ఆయన తన నామినేషన్ ఉపసంహరణతో

పోటీకి అవకాశం లేకుండా పోయింది. అనంతరం కాట్రగడ్డ సతీష్



అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. నామినేషన్ ఉపసంహరణ అనంతరం ప్రవీణ్‌ను పోలీసులు తిరిగి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ పరిణామాల క్రమం ఎన్నికల ప్రక్రియపై పలు ప్రశ్నలకు తావిచ్చింది.

**సతీష్ ఎన్నిక.. బాణసంచా సంబరాలు**

కాట్రగడ్డ సతీష్ ఎన్నిక ఖరారైన వెంటనే రైస్ మిల్ అసోసియేషన్ భవనం ఎదుట బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఒకవైపు గతంలో అధ్యక్షుడిగా పనిచేసిన ప్రవీణ్ నామినేషన్ వేయకపోవడం, మరోవైపు సతీష్ ఏకగ్రీవ ఎన్నికతో సంబరాలు జరగడం రాజకీయ వర్గాల్లో చర్చకు కారణమైంది. సాధారణంగా ఎన్నికల విజయాల సందర్భంగా సంబరాలు జరుపుకోవడం సహజమే అయినప్పటికీ, తాజా పరిణామాల నేపథ్యంలో వీటికి రాజకీయ ప్రాధాన్యం ఆపాదిస్తున్నారు. అసోసియేషన్ ఎన్నికల్లో తమకు అనుకూలమైన అభ్యర్థిని గెలిపించుకునేందుకు కొందరు నాయకులు ప్రయత్నించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలు, సంబంధిత నాయకుల వివరణలు వెలువడాల్సి ఉంది. అరెస్టులు, నామినేషన్ ఉపసంహరణ, ఏకగ్రీవ ఎన్నిక, సంబరాల వెనుక అసలు పరిణామక్రమం ఏమిటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# ములుగు వార్త

## కరాటే పోటీల్లో మెడల్స్ సాధించిన విద్యార్థులు



**ప్రభాతవార్త ఏటూరునాగారం అక్టోబర్ 25:**




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని విశాఖపట్నం జరిగిన 5 వ సౌత్ జోన్ కరాటే పోటీల్లో ఏటూరునాగారం కరాటే అకాడమికి చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించినట్లు కరాటే మాస్టర్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ 21 విబాగంలో అలువాల సుమనశ్రీ బ్రౌంజ్ మెడల్‌ను సాధించారని . 52 కేజీల విభాగంలో వసంత విశాల్ సాయి బ్రౌంజ్ మెడల్‌ను సాధించినట్లు అండర్ 8 విభాగంలో ఆధ్య సిల్వర్ మెడల్ సాధించినట్లు ఆయన తెలిపారు . ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను అభినందించారు.

## నీటికుంటలో పడి మృతి చెందిన అక్షిత్ కుటుంబానికి ఆర్థిక సాయం

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రాంలాల్



**మరిపెడ, అక్టోబర్25, ప్రభాతవార్త:**

మరిపెడ మున్సిపాలిటీ ఐదో వార్డుకు చెందిన బోడా హరీష్ కుమారుడు అక్షిత్ కుమార్ ఇటీవల నీటికుంటలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బానోత్ రాంలాల్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా అక్షిత మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిన్న వయసులోనే బాలుడు మృతి చెందడం బాధాకరమని, కుటుంబానికి జరిగిన నష్టం తీరనిదని పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ అఫ్జల్, మేగ్యా శ్రీను, బోడా రవినాయక్, మనోజ్ కుమార్, సర్వర్ బాయ్, ఇస్లావత్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరుకావాలి

కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం, అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 26న సోమ వారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి ప్రారంభమవు తుందని, ప్రజలు తమ సమస్యలపై లిఖితపూర్వక ఫిర్యాదులు సమర్పించాలని తెలిపారు. ఫిర్యాదులను స్వీకరించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం, కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంతో పాటు అన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లోనూ ప్రజావాణి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

అక్టోబర్ 28న అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం

రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

**ఖమ్మం కలెక్టరేట్ అక్టోబర్25: (ప్రభాతవార్త)**



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఖమ్మం జిల్లాలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత వాతావరణ శాఖ అక్టోబర్ 25న జారీ చేసిన వాతావరణ బులెటిన్ ప్రకారం ఈ నెల 27న జిల్లాలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 28న జిల్లాలో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిందని పేర్కొన్నారు. అక్టోబర్ 29న కూడా అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. వర్షాల నేపథ్యంలో రైతులు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:**

ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని, చెట్ల క్రింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఆశ్రయం పొందరాదని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షి స్తూ అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలు, జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలను ప్రజలు, రైతులు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## నందిపాటి వెంకన్న మృతికి సీపీఎం నాయకుల నివాళి



**బయ్యారం, ప్రభాతవార్త, అక్టోబర్25:**

సీపీఎం ఖమ్మం జిల్లా నాయకులు నందిపాటి మనోహర్, రమేష్‌ల తండ్రి నందిపాటి వెంకన్న ఆదివారం మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీను పార్టీ జెండా కప్పి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాధుల శ్రీను మాట్లాడుతూ నందిపాటి వెంకన్న మృతి బాధాకరమని అన్నారు. ఆయన మరణానంతరం కూడా మరో వ్యక్తికి చూపును ప్రసాదించేలా కుటుంబ సభ్యులు నేత్రదానం చేయడం గొప్ప విషయమని కొనియాడారు. నేత్రదానం ద్వారా మరొకరి జీవితంలో వెలుగులు నింపడం మానవత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. వెంకన్న కుటుంబ సభ్యులు తీసుకున్న ఈ నిర్ణయం సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో నక్క సైదులు, దొడ్డెల రామ్మూర్తి, నాగలి సురేష్, నంబూరు మధు, అంగిరేకుల నాగేశ్వరరావు, నిడికొండ చంటి, వల్లాల వెంకన్న, వెన్ను మోహన్, తిమ్మిడి భద్రయ్య పాల్గొని నందిపాటి వెంకన్నకు నివాళులర్పించారు.

## గిరిజన దర్బార్, ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరుకావాలి

**భద్రాచలం, అక్టోబర్ 25 (ప్రభాతవార్త):**

భద్రాచలం ఐటీడీఏ కార్యా లయంలో నేడు నిర్వహించనున్న గిరిజన దర్బార్, సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధి. కారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ సూచించారు. ఆదివారం ఈ మేరకు వారు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. సంబంధిత ఐటీడీఏ యూనిట్ అధికారులు, డివిజన్ అధికారులు సోమవారం ఉదయం 10.30 గంటలకు భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లోని సమావేశ మందిరాలకు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు.

# అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలి

### రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్



ప్రభాతవార్త ఏటూరునాగారం, అక్టోబరు 25: రాబోయే పట్టభద్రుల(ఎమ్మెల్సీ) ఎన్నికల నేపథ్యంలో డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ(ఆర్టీఏ) డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్ సూచించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఆదేశాల మేరకు, కాం గ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో ఆదివారం మండల కేంద్రంలోని ఐటీడీఏ గిరిజన భవన్లో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న అభ్యర్థులను ఆయన కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన ప్రతి ఒక్కరూ నవంబరు 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు . ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములై కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. పోలీసు ఉద్యోగాల కోసం కష్టపడి శిక్షణ పొందుతున్న అభ్యర్థుల్లో ఇప్పటివరకు డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి తన వంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ములుగు ఆర్టీవోతో మాట్లాడి, తన సొంత ఖర్చులతో పది మంది అభ్యర్థులకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రాధాన్యతను వివరిస్తూనే, రాష్ట్ర మంత్రి సీతక్కతో ఫోన్లో అభ్యర్థులతో మాట్లాడించారు. గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు, అభ్యర్థుల శిక్షణకు సంబంధించిన పలు అంశాలపై మంత్రి సీతక్క అభ్యర్థులకు దిశానిర్దేశం చేసి అవగాహన కల్పించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామన్నగూడెం సర్పంచ్ గద్దల నవీన్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మధు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఏటూరునాగారం వార్త

# మీ ఓటు. మీ భవిష్యత్తు మీ చేతిలోనే ఉంది



మంగపేట అక్టోబర్25, ప్రభాతవార్త: విద్యా ఉద్యోగం అభివృద్ధి మన హక్కు. 2023 కు ముందు డిగ్రీ పాసైన విద్యార్థులు ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించు కోవాలని బీ ఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకులు మంచాల నాగేంద్ర కుమార్ అన్నారు నవంబర్ 6 చివరి తేదీ లోపు ఎమ్మెల్సీ ఓటు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేయించుకోగలరు. పాత ఓటర్లు ఫాం 18 నింపవలసి ఉంటుంది ఈసీ వెబ్సైట్లో ఫామ్ ని అప్లోడ్ చేయవలసి ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 30న ఈసీ తుది జాబితా విడుదల చేయనుందని అన్నారు. వరంగల్ ఖమ్మం నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# విశేష తిరు కళ్యాణానికి పయనమైన భూ నీళా గోదా సమేత వెంకటేశ్వర స్వామి



గార్ల,అక్టోబర్25,ప్రభాతవార్త: తిరుమల తిరుపతి నుండి స్వయాన వేట మార్గాన వచ్చి మండల పరిధి మర్రిగూడెం గ్రామ సమీపాన స్వయంభుగా వాసికెక్కిన శ్రీ భూ నీళా గోదాదేవి సమేత శ్రీ వేట వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని కళ్యాణ మండపంలో నేడు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించే విశేష తిరు కళ్యాణానికి ఆదివారం స్థానిక ఆలయం నుండి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై శ్రీదేవి భూదేవి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నాయి, మేళ తాళాలు, వేద పండితుల వేదమంత్రాలు, ఏడుకొండల వాడా వెంకటరమణ గోవిందా.. గోవిందా... భక్తుల నామస్మరణాల నడుమ బయలుదేరారు. ఆనవాయితీ గా ప్రతి యేట నిర్వహిస్తున్న శ్రీ భూ నీళా గోదాదేవి సమేత శ్రీ వేట వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వేద వాద్య ఘోష నడుమ పాఖాలయేటి నుండి తెచ్చిన పుష్కర నవకలశ తీర్థంతో శ్రీవారికి అభిషేకం చేసి పట్టు వస్త్రాలు సమర్పించి, వివిధ రకాల పూలు, పూలమాలలతో వైభవంగా అలంకరించి పెళ్లి కుమారుడిగా ముస్తాబు చేశారు. సాయంత్రం 4గం.లకు స్థానిక ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల పూలమాలతో అలంకరించిన ప్రత్యేక రథంపై సన్నాయి మేళ తాళాలు, వేద పండితుల వేదమంత్రోత్సరణాల నడుమ శ్రీభూ నీళాగోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని అలంకరించారు. మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ బాణోత్ పార్వతీ హథిరాం నాయక్ దంపతులు పూజాకార్యక్రమం లో పాల్గొని ఆలయ చైర్మన్, వైస్ చైర్మన్, ఎండోమెంట్ అధికారి సత్యనారాయణ, దర్మకర్తల మండలి, ప్రముఖులు, భక్తులతో కలిసి పాలకాయలు కొట్టి ప్రత్యేక రథాన్ని ప్రారంభించారు. సన్నాయి మేళ తాళాలు, వేద పండితుల వేదమంత్రోత్స రణాలు, ఏడుకొండలవాడా వెంకటరమణ గోవిందా.. గోవిందా.. భక్తుల నామస్మరణలు, మహిళల కోలాటాలు, స్వామివారి డిజె పాటల నడుమ అంగరంగ వైభవంగా బయలుదేరినారు. మండల కేంద్రం లో ప్రధాన పురవీధుల గుండా స్వామివారి శోభాయాత్ర నిర్వహించగా ఇంటింటి నుండి భక్తులు స్వామి వారికి పాల కాయలు సమర్పించి హారతులు అందించారు. ఎస్సై బి. సాయికుమార్ పోలీస్ బందోబస్తు నిర్వహించి పర్యవేక్షి ంచారు. శ్రీదేవి భూదేవి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలు మర్రిగూడెం ఆలయానికి చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీ వేట వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ అజ్మీర బన్సీ లాల్, వైస్ చైర్మన్ బానోతు అర్జున, ధర్మకర్త మండలి సభ్యులు, ఆలయ ఎండోమెంట్ అధికారి నిడిగొండ సత్యనారాయణ, వేద పండితులు రామానాయణం అచ్యుతా చార్యులు, గోవిందాచార్యులు, పవన్ స్వామి, హర్షాచార్యులు, సందీప్ ఆచార్యులు, రఘు స్వామి, నందు నచకేతన్ స్వామి, భక్తులు ప్రముఖులు పుల్ల ఖండం రమేష్ బాబు, పరుచూరి కుటుంబరావు, టీటీడీ జిల్లా ప్రచార మండలి సభ్యులు మాలోత్ రాములు నాయక్, మల్లం నరేందర్, పుల్లఖండం శ్రీనివాస్ గుప్తా, వేమిశెట్టి శ్రీనివాస్, పుల్లఖండం వేణు గోపాల్, కందునూరి ఉపేందర్, బేతి వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, కవిత, కంఠం లక్ష్మి, రమా, బేతి సరోజ, ఉషా, మాణిక్యమ్మ, కనకమ్మ, సరిత, అత్యధికంగా కోలాట, భజన మండలి, మహిళలు, తదితరులున్నారు.

# నేడు జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలి

### -సిఐటియు జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్



గార్ల,అక్టోబర్25,ప్రభాతవార్త: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నేడు హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక నెహ్రూ సెంటర్ లో సిఐటియు ఆధ్వర్యంలో మహాధర్నా పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో లక్షల మంది సంఘటిత,అసంఘటిత కార్మికులు కదం తొక్కాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గ సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయని, కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ కార్మిక హక్కులను హరిస్తున్నాయని, బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసిందన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక హక్కులు, సమస్యలను పరిష్కరించడంలో బిజెపి అడుగుజాడలలో నడుస్తూ లేబర్ కోడ్ లను వ్యతిరేకించ కుండా అమలు చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో అంబటి వీరస్వామి, అప్పిరెడ్డి, మోలానా, జె.శ్రీను, వార్డు సభ్యులు ఎల్.పూర్ణచంద్రరావు, సాయి, కార్మికులు ఉన్నారు.

# పూర్తిస్థాయిలో ఓటరు నమోదుకు కృషి చేయాలి



గార్ల, అక్టోబర్25,ప్రభాత వార్త: రానున్న పదిరోజులు అత్యంత కీలకమని, ప్రణాళికా బద్ధంగా ప్రతి గ్రామంలో అర్హులైన ప్రతి పట్టభద్రులను గుర్తించి పూర్తి స్థాయిలో ఓటరు నమోదు చేయించేలా నాయకులు, కార్యకర్తలు విధిగా కృషి చేయాలని ఇల్లందు నియోజకవర్గ పట్టభద్రుల ఓటర్ నమోదు ఇంచార్జీ చాడ కిషన్ రెడ్డి, ఇల్లందు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాణోత్ హరిసింగ్ నాయక్ కోరారు. త్వరలో జరుగనున్న ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా ఇల్లందు నియోజకవర్గ పరిధిలోని గార్ల మండలంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని వారు గార్ల మండల సమన్వయ కమిటీ సభ్యులు, గ్రామ పంచాయతీ బాధ్యులతో కలిసి గార్ల మండలంలో కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్షి ంచారు. ఈ సందర్భంగా స్థానిక వర్తక సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. ఇల్లందు నియోజకవర్గ పరిధిలోని గార్ల మండలంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని గులాబీ దళం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, గ్రామ పంచాయతీ బాధ్యులు, సమన్వయ కమిటీ సభ్యులు ప్రతి గడపకూ వెళ్లి గ్రాడ్యుయేట్లను చైతన్య పరచాలని, నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించు కోవడమే మనందరి ఏకైక లక్ష్యం కావాలని స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్త ఒక సైనికులుగా పనిచేసి, పట్టభద్రుల ఓటరు నమోదును మహోద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను పట్టభద్రులకు వివరిస్తూ, అభ్యర్థికి భారీ విజయాన్ని అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భాణోత్ హరి సింగ్ నాయక్, గార్ల మండల బిఆర్ఎస్ సమన్వయ కమిటీ సభ్యులు శీలంశెట్టి రమేష్, బుడిగ మురళి, పానుగంటి రాధాకృష్ణ, మహమ్మద్ ఖదీర్, బాలు నాయక్, రాందాస్ నాయక్, గార్ల పట్టణ మాజీ అధ్యక్షులు గాజుల గణేష్, మాజీ సర్పంచ్ శ్రీను నాయక్, లక్ష్మారెడ్డి, ముంగి రాములు,తాళ్లూరి అనిల్, యాకుబ్ పాషా, శ్రీనాథ్, గంగావత్ అశోక్, కొండా రవీందర్, తాళ్లూరి మహేష్, అంకాపాక కిరణ్, శ్రీరామ్, విజయ్, గ్రామ పంచాయతీ ఇన్చార్జులు,యువజన విభాగ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో పతకాల పంట

## భద్రాద్రి బిడ్డకు ఘన స్వాగతం!

### 74 ఏళ్ల వయసులో ప్రపంచ వేదికపై సత్తా

భద్రాచలం, ప్రభాతవార్త: అమెరికాలో జరిగిన ప్రపంచ పవర్లిఫ్టింగ్ పోటీల్లో భద్రాచలానికి చెందిన డి.వి. శంకర్రావు రెండు పతకాలు సాధించి స్వదేశానికి చేరుకున్నారు. ప్రపంచ క్లాసిక్ పవర్లిఫ్టింగ్లో కాంస్యం, ప్రపంచ ఎక్విప్డ్ పవర్లిఫ్టింగ్లో రజత పతకం సాధించి భారత కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పారు. 74 ఏళ్ల వయసులోనూ అసాధారణ క్రీడా ప్రతిభ కనబరిచి వయసు విజయానికి అడ్డంకి కాదని నిరూపించారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న శంకర్రావుకు ఆయన కోచ్ జి.వి. రామిరెడ్డి, కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సత్కరించడంతోపాటు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

శంకర్రావు విజయాల వెనుక ఆయన పట్టుదల, నిరంతర సాధనతోపాటు కోచ్ రామిరెడ్డి శిక్షణ, మార్గదర్శకత్వం కీలకంగా నిలిచాయని పలువురు అభినందించారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై రెండు పతకాలతో భద్రాచలం ఖ్యాతిని చాటిన శంకర్రావు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఎల్కతుర్తి మండలంలో బీజేపీ బూత్ కమిటీల నియామకం

**- బీజేపీ పార్టీకి ఆకర్షితులై పలువురు చేరిక**

**ఎల్కతుర్తి అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

భారతీయ జనతా పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా ఎల్కతుర్తి మండలంలోని కోతులనడుమ, గోపాల్పూర్ గ్రామాల్లో ఆదివారం బీజేపీ బూత్ కమిటీలు బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఓ ప్రకటన లో తెలిపారు.కోతులనడుమ గ్రామంలో 285, 286 బూత్‌లకు అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కనిపర్తి శామ్ సుందర్, ఎర్రోళ్ల అఖిల్, మాట్ల వినయ్, రావుల శ్రీధర్, మాట్ల విశాల్, రావుల శ్రీకాంత్, పల్లపు శ్రీను, గట్టు శ్రీనివాస్ గోపాల్పూర్ గ్రామంలో 305వ బూత్ అధ్యక్షుడిగా కుమ్మరి సతీష్, 306వ బూత్ అధ్యక్షుడిగా చిత్రాల భాస్కర్, 307వ బూత్ అధ్యక్షుడిగా ఉప్పుల శివప్రకాష్ ఎన్నికయ్యారు. పార్టీలో చేరిన వారికి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు, బూత్ స్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా



సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో మండల ప్రధాన కార్యదర్శులు అల్లి కుమార్, చిత్రాల వెంకటేష్, సీనియర్ నాయకులు కంచర్ల శంకరయ్య.ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఎర్రోళ్ల రాజు, మడిపల్లి కొమురయ్య, మాట్ల జయేందర్, చిరంజీవి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి చెస్ క్రీడాకారులను అభినందించిన బిఆర్ఎస్ నాయకులు రంజిత్ రెడ్డి

**సుబేదారి అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

హనుమకొండ టీచర్స్ కాలనీలోనే బిఎస్ చెస్ అకాడమీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 15 చెస్ టోర్నమెంట్ కి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ నాయకులు దుగ్గంపూడి రంజిత్ రెడ్డి పాల్గొన్నారు. విజేతలకు బహుమతి ప్రధానోత్సవం చేసిన అనంతరం మాట్లాడుతూ ఈ రోజుల్లో విద్యార్థులు సెల్ ఫోన్ లకు అలవాటు పడుతున్నారని వాటిని పక్కకు పెట్టి మేధోపరమైన ఆటలు ఆడటం చాలా గొప్ప విషయమని విజేతలుగా నిలిచిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేస్తూ వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్ చేస్తాకాడమీ నిర్వాహకులు బొల్లం సంపత్ , సిబ్బంది పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు ఫిరోజ్, వరుణ్ ,సందీప్ యాదవ్ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నిక అత్యంత ప్రతిష్టాత్మకం

**- ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు ప్రక్రియలో ముందుండి పనిచేయాలి**

**- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరవేయాలి: ఎమ్మెల్యే రేవూరి**

**అక్టోబర్ 25, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్ :**

రాబోయే వరంగల్ ఖమ్మం నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఓటర్ నమోదు ప్రక్రియలో ముందుండి పని చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ లోని సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద గల జి ఎస్ ఆర్ గార్డెన్ లో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ స్థాయి సమావ్నేశ జరిగింది. ఈ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ ఇంచార్జ్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి ,ఎండి ఆయూబ్ , గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు కక్కిరేని శ్రీనివాస్, పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ... వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక అత్యంత



ప్రతిష్టాత్మకమని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ని పరకాల నియోజకవర్గం నుండి అత్యధిక మెజారిటీ అందించి గెలిపించుకుందాం అన్నారు. అందుకు ప్రతి కార్యకర్త గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు ప్రక్రియలో ముందుండి పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుద్యోగుల కోసం విద్యావంతుల కోసం తీసుకుంటున్న విప్లవత్మక నిర్ణయాలను రికార్డు స్థాయి ఉద్యోగ నియామకాలను గ్రాడ్యుయేట్స్ లోకి బలంగా తీసుకెళ్లాలి అన్నారు. సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని, ప్రత్యర్థుల అబద్ధాలను తిప్పి కొట్టాలన్నారు. పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బూతు స్థాయి నుండి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. గ్రాడ్యుయేట్స్ కు ఓటర్ నమోదు కేంద్రం హెల్ప్ డెస్క్ను మండలాల వారిగా ఏర్పాటు చేసామని అన్నారు. ఎస్ ఐ ఆర్ పేరుతో కోట్ల తొలగింపుకు వ్యతిరేకంగా నవంబర్ 1న తెలంగాణ కాంగ్రెస్ చేపట్టిన చలో ఢిల్లీ నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇల్లు, రైతులకు రైతు భరోసా, రైతు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి మ్ర పథకం, స్వర్ణ బియ్యం, తదితర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి అన్నారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిలో గల ఫ్రంట్ ఆర్గనైజేషన్ కమిటీలను త్వరలో పూర్తిస్థాయిలో నియమిస్తామన్నారు.ఎల్ నినో వల్ల వచ్చే పరిణామాలు, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

# కొంతం వైష్ణవికి మెడికల్ కాలేజ్ ట్యూషన్ ఫీజు 29,000.00 చెల్లించనున్న టిపిఎస్‌యు

**అక్టోబర్ 25, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్:** ఆదివారం వరంగల్లో పద్మశాలి ప్రతిభా పురస్కార్ ఆత్మీయ సన్మానోత్సవం కార్యక్రమంలో ఒక నిరుపేద కుటుంబానికి చెందిన అమ్మాయి . కొంతం వైష్ణవి, తండ్రి (లేట్ ) శరత్ బాబు గవిచర్ల గ్రామము, మండలం సంగెం, వరంగల్ జిల్లా ఎంబిబిఎస్ సీటు మహబూబాబాద్ గవర్నమెంట్ కాలేజ్ లో వచ్చిందని, తనకు సహాయం చేయమని కోరడం తో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం, వరంగల్ జిల్లా తరపున ఆ అమ్మాయికి ఐదు సంవత్సరాల పాటు ట్యూషన్ ఫీజు రు .లు . 29,000.00 చెల్లిస్తామని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు హామీ ఇవ్వడం జరిగింది. సోమవారం రోజున గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, మహబూబాబాద్ లో సంఘము తరుపున ఫీజు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, పిటిపిప రాష్ట్ర అధ్యక్షులు సామంతుల శ్రీనివాస్ , టి పి ఆర్ యు ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు బిట్ల వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రపు రాజమౌళి, జిల్లా



ప్రధానకార్యదర్శి గుండు కామేశ్వర రావు , రాష్ట్ర ఆర్గనైసింగ్ కార్యదర్శి చేరాల మురళీకృష్ణ, రాష్ట్ర ప్రచారకార్యదర్శి దేవులపెల్లి సాయిరాజ్, జిల్లా సంస్థాగత కార్యదర్శి కొండబత్తుల రాజమోళి, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి గోరంట్ల అశోక్, ప్రచార కార్యదర్శి కోడూరి రమేష్, క్యాతం ఆనందరావు, నాయకులు గోషికొండ సుధాకర్ , తదితరులు పాల్గొన్నారు




# ముదిరాజ్‌లను బీసీ(ఏ)లో చేర్చే ప్రకటనను వెనక్కి తీసుకోవాలి

**- బీసీ ఏ కులాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నేరెళ్ల విజయ్ కుమార్**

**పరకాల అక్టోబర్ 25 (ప్రభాతవార్త):**



ముదిరాజ్ కులస్తులను బీసీ(ఏ)లోకి మార్చే ప్రకటనను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని బీసీ ఏ కులాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నేరెళ్ల విజయ్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.బీసీ(ఏ)లో ఉన్న 57 కులాల్లో అధిక శాతం చేతివృత్తులపై ఆధారపడి జీవించే కులాలే ఉన్నాయని తెలిపారు. ఇప్పుడిప్పుడే తమ పిల్లలు డిగ్రీ, బీటెక్ వంటి ఉన్నత విద్యనుఅభ్యసించి ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఎదుగుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ముదిరాజ్ కులస్తులను బీసీ(ఏ)లో చేరిస్తే తమ కులాల పిల్లల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముదిరాజ్ కులస్తులను బీసీ (ఏ) లో చేర్చే నిర్ణయాన్ని తాము అంగీకరించబోమనిస్పష్టం చేశారు. ప్రభుత్వం చర్చలు జరిపి ముదిరాజ్ లకు ఇప్పటికే కేటాయించిన 7 శాతం రిజర్వేషన్లకు అదనంగా మరో 7 శాతం కలిపి మొత్తం 14 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఆమోదిస్తామని తెలిపారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే రానున్న రోజుల్లో తమ పిల్లల ఉద్యోగ, రాజకీయ భవిష్యత్తుకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ముదిరాజ్‌లకు అదనపు రిజర్వేషన్లు కల్పించాలనుకుంటే బీసీ ఏకు వేరుగా ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలని సూచించారు. గతంలో ఇలాంటి ప్రయత్నాలను న్యాయస్థానాలు కొట్టివేసిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అమలు సాధ్యం కాని హామీలతో బీసీ కులాల మధ్య విభేదాలు సృష్టించవద్దని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రకటనను వెనక్కి తీసుకోకపోతే 57 ఉపకులాల సంఘాల ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడించి, పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# సమాజ అభివృద్ధే సంఘ్ లక్ష్యం

**పరకాల అక్టోబర్ 25 (ప్రభాతవార్త):**




దేశంలోని సమాజ అభివృద్ధే సంఘ్ లక్ష్యమని, ఈ లక్ష్యం కోసం సంఘం 100 ఏళ్లుగా కృషి చేస్తోందని ఆర్ఎస్ఎస్ పరకాల ఖండ్ సంఘచాలక్, కార్యవాహలు సాదు సర్వేశం, కొడకండ్ల శ్రీకాంత్ తెలిపారు. పరకాలలోని శివాజీ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.పరకాల పట్టణంలోని రాధిక ఆయుర్వేద వైద్యశాల వైద్యులు డా. రాకేష్ ఆధ్వర్యంలో వచ్చిన వారికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రపంచానికి భారత్ అందించిన గొప్ప వరం ఆయుర్వేదమని, దేశ మూల వైద్యమైన ఆయుర్వేదాన్ని అందరూ ఆదరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కొడకండ్ల శ్రీకాంత్ మాట్లాడుతూహిందువులను చైతన్య పరిచి, శక్తివంతం చేయడం, సాంస్కృతిక పునరుజ్జీవనం చేయడానికి గడిచిన వందేళ్లుగా ఆర్ ఎస్ ఎస్ దేశంలో పనిచేస్తోందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డా. విద్యాసాగర్, సంఘ స్వయంసేవకులు చంద్రమోహన్, రఘునందన్, రాకేష్, గురు ప్రసాద్, రామన్న, రాజభద్రయ్య తదితరులు, 30 మంది స్వయంసేవకులు పాల్గొన్నారు.

వరంగల్ వార్త

# దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయం లెక్కలు భహిర్గతం చేయాలి..

- వివరాలు కోరిన ఎస్.ఆర్.ఆర్ తోట అభివృద్ధి కమిటీ సభ్యులు

**వరంగల్ అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

వరంగల్ తూర్పు నియోజకవర్గం అండర్ రైల్వే గేట్ ప్రాంతంలోని సిరంగి రాజారామ్ తోటలో ప్రసిద్ధిగాంచిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవాలయం దాతలు సమర్పించిన బంగారు వెండి నగదు లెక్కలు బహిర్గతం చేయాలని సిరంగి రాజారాం అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం కమిటీ అధ్యక్షులు పరదేశి రాజేష్, ప్రధాన కార్యదర్శి చిలువేరు రవీందర్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయ శర్మను దేవాలయాల శాశ్వత ధర్మకర్తలు ఆకారపు శశిధర్, వీరాంజనేయ స్వామి ఆలయ అనిల్ లను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్ది సంవత్సరాలుగా కనకదుర్గ అమ్మవారి దేవాలయానికి వస్తు, నగదు రూపంలో అమ్మవారికి నగదుతోపాటు ఎన్ని రకాల బంగారు, వెండి నగలు ఉన్నాయో గ్రామ ప్రజలకు తెలపాలని అన్నారు. విరాళాలు ఇచ్చిన దాతల పేర్లను వారి కుటుంబాలపై అమ్మవారి ఆశీర్వాదం ఉండేలా



ప్రణాళికలు చేయాలని కోరారు. లేనిపక్షంలో కమిటీ సభ్యులు తీసుకునే నిర్ణయానికి బాధ్యులు కాగలరని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సిరంగి రాజారాం తోట అభివృద్ధి కమిటీ సభ్యులు ఆడెపు జగన్, చిలువేరు రాజేందర్, వలుపదాసు మదు, బుదారపు హరికృష్ణ, బైరి ప్రతాప్, దోరం ఆనంద్, రాముల బిక్షపతి, గౌడ సందీప్, పాసి కంటి రాజు, ఆడెపు శ్రీను, బత్తుల కుమార్, బొల్లం రాజు, బుధరపు వివేక్, వనంరమేష్ పాల్గొన్నారు.

# ఆయిల్‌ఫామ్ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

**వర్ధన్నపేట/అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

ఆయిల్‌ఫామ్ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మండల ఆయిల్‌ఫామ్ కమిటీ అధ్యక్షుడు తక్కళ్లపెల్లి సత్యనారాయణ రావు తెలిపారు. ఆదివారం వర్ధన్నపేట, టీకే తండా, కొనాపురం గ్రామాల్లో రైతులకు చెందిన 31 ఎకరాల ఆయిల్‌ఫామ్ తోటలను కమిటీ సభ్యులు సందర్శించారు. చెట్ల పెరుగుదల, తోటల



నిర్వహణ, ఎల్‌నినో ప్రభావంపై రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రైతులు డ్రిప్ సిస్టమ్, నిచ్చెనల సబ్సిడీ, విద్యుత్ స్తంభాల తొలగింపు, ఉచిత సోలార్ సిస్టమ్‌ల ఏర్పాటు తదితర సమస్యలను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గుజ్జ గోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు సురేందర్‌రెడ్డి, బోయినపల్లి దేవేందర్‌రావు, సభ్యులు రాజు, మునుకుంట్ల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# టి.జి.ఎం.ఎఫ్ సర్వసభ్య సమావేశం విజయవంతం

**వరంగల్ సిటీ అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

తెలంగాణ మీ సేవా ఫెడరేషన్ (టి.జి.ఎం.ఎఫ్) వరంగల్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు బైరా శంకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ మోహిద్, జిల్లా అధ్యక్షులు సామల రాకేష్, జిల్లా ఉపాధ్యక్షులు సాజిద్, లావణ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, జిల్లా కోశాధికారి నరేష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీ సేవా నిర్వాహకుల సమస్యలు, కమీషన్లు, కొత్త సేవలు, ఆరోగ్య బీమా, సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు. వీఎల్‌ఈల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మీ సేవా నిర్వాహకుడు ఐక్యంగా ముందుకు రావాలని, వీఎల్‌ఈల హక్కుల సాధన, కుటుంబాల భద్రత, వృత్తి గౌరవం కోసం సమష్టిగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. వీఎల్‌ఈల సమస్యల పరిష్కారం, సంక్షేమం, ఆర్థిక భద్రత



సాధించే వరకు టి.జి.ఎం.ఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం ఈ సమావేశాన్ని విజయవంతం చేసిన రాష్ట్ర కమిటీ ప్రతినిధులకు, జిల్లా కమిటీ సభ్యులకు, వీఎల్‌ఈ అందదరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

# నవ్య శ్రీ కి పద్మశాలి ప్రతిభా పురస్కార్ అవార్డు ప్రదానం

**వరంగల్ సిటీ అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

పద్మశాలి అఫిషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా), వరంగల్ ఆధ్వర్యంలో ఆదివారం శివనగర్‌లోని పద్మశాలి కళ్యాణ మండపంలో పద్మశాలి ప్రతిభా పురస్కార్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గకు చెందిన గుల్లెపెల్లి శివకుమార్, పల్లవి దంపతుల కుమార్తె గుల్లెపెల్లి నవ్య శ్రీ కి తెలంగాణ ఈసెట్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) విభాగంలో రాష్ట్రస్థాయిలో 320వ ర్యాంకు సాధించినందుకు ప్రోత్సాహకంగా ఆమెకు ప్రతిభా పురస్కార్ అవార్డును అందజేశారు. మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద భాస్కర్ పోపా, వరంగల్, అసోసియేట్ అధ్యక్షులు మాటేటి సంతోష్, పాలకవర్గ సభ్యులు చేతుల మీదుగా ప్రతిభా పురస్కార్ అవార్డు ప్రశంసా పత్రం, షీల్డ్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రాపోలు ఆనంద్ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, వారి విజయాలు ఇతర విద్యార్థులకు



స్ఫూర్తిగా నిలవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ పురస్కారం తనకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని నవ్య శ్రీ పేర్కొంటూ, అవార్డును అందించిన పోపా, వరంగల్ పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# నూతన ఎస్‌హెచ్‌ఓను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు

**వర్ధన్నపేట/అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై భాగం ప్రవీణ్‌ను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు అడుప రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రాయపురపు కుమారస్వామి, కిసాన్



మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కర్క సోమిరెడ్డి, జిల్లా నాయకులు కొండేటి సత్యం, బీజేవైఎం జిల్లా కార్యదర్శి పెండోట పవన్ (మహంత్), సీనియర్ నాయకులు నాంపల్లి యాకయ్య, పెద్దూరి రాజు, సంపత్, దుర్గయ్య, తేజ నాయక్, రాము, కార్తీక్, మచ్చ రాజు, శ్రీరాముల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో ట్రాలీ యూనియన్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే

**వరంగల్ సిటీ అక్టోబర్ 25 ప్రభాతవార్త:**



లక్ష్మీ గణపతి ఆటో ట్రాలీ యూనియన్ 10వ వార్షికోత్సవాన్ని అధ్యక్షులు ఆకుతోట రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ లక్ష్మీ గణపతి ఆటో ట్రాలీ యూనియన్ పదవ వార్షికోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషకరమని అన్నారు. యూనియన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న అధ్యక్షులు ఆకుతోట రాజు కు, కార్యవర్గ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉండటమే కాకుండా, ఆపద సమయంలో ఒకరికొకరు అండగా నిలబడడం సంతోషం అన్నారు. అలాగే ఈ ఏడాది సభ్యులకు మూడు గ్రాముల బంగారు నాణేలు అందించడం అభినందనీయమని, వచ్చే ఏడాది ప్రతి సభ్యునికి తులం బంగారం అందించే స్థాయికి సంఘం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా ఆటో ట్రాలీ డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రత్యేక ఆటో అడ్డా స్థలం, కార్మికులకు బీమా సదుపాయాలు, ఇతర అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ గణపతి ఆటో ట్రాలీ యూనియన్



సభ్యులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పులి అనిల్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి రాష్ట్ర నాయకులు

- మహేందర్ మాదిగ, సర్పంచ్ రడం భరత్...

**గీసుగొండ అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

గీసుగొండ మండలంలోని రాంపురం పరిసర ప్రాంతమైన గట్టుకిందిపల్లెకు చెందిన పులి అనిల్ గత సంవత్సరం వరంగల్ లో భారీగా కురిసిన వరద నీటిలో మునిగి మృతి చెందాడు. ఆదివారం శుభ సభ్యులు నిర్వహించిన అనిల్ ప్రధమ వర్ధంతి కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి రాష్ట్ర నాయకులు యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ బిర్రు మహేందర్ మాదిగ, ఖమ్మం జిల్లా ఇంచార్జ్ కందిక విజయ్ కుమార్ లు స్థానిక సర్పంచ్ రడం భరత్ తో కలిసి మృతుడు అనిల్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపసర్పంచ్ పులి సూరయ్య, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ ఎఫ్ నాయకులు బిర్రు గోలి సుధాకర్, గోలి కొమరయ్య, బిర్రు బిక్షపతి బిర్రు రవీందర్ స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కోమలత్వానికి.. సామరస్యానికి ప్రతీక

## జనగామ యువకుడు "అజ్జు" మహమ్మద్ అస్గర్

**పభాతవార్త ప్రతినిధి, జనగామ :**



సమతా మమతలకు, సర్వధర్మ సమభావనకూ ప్రతీకగా నిలుస్తోంది జనగామ పట్టణంలోని రెడ్డిస్ట్రీట్‌కు చెందిన "అజ్జు" కులమతాల సరిహద్దులను చెరిపేస్తూ, భక్తి భావానికి ఎల్లలు లేవని నిరూపిస్తున్నాడు స్థానిక ముస్లింయువకుడు అజ్జు. గత 12సంవత్సరాలుగా వరుసగా అమ్మవారి దివ్యవిగ్రహాన్ని స్వయంగా తెప్పించి, మండపారాధన చేసి, భక్తిశ్రద్ధలతో దేవీనవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తూ స్థానికప్రజల గుండెల్లో ప్రత్యేకస్థానాన్ని సంపాదించుకున్నాడు.

### - భక్తికి లేదు భేదం.. అజ్జుసేవా తత్పరత..:

ప్రతిఏటా దేవీనవరాత్రుల ఉత్సవాలవేళ రెడ్డిస్ట్రీట్‌లో ఆధ్యాత్మిక శోభ విరాజిల్లుతోంది. అజ్జు స్వయంగా ముందూ వెనుకై ఉండి కమిటీసభ్యులతో దుర్గమ్మ మాత దివ్య మూర్తిని నిలిపి, నిత్యపూజలు, అలంకరణలు దగ్గరుండి జరిపిస్తుంటాడు. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ వేలాదిమంది భక్తులకు దాతలద్వారా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఆకలితీర్చే దైవకార్యంలో భాగస్వామి అవుతున్నాడు. "దైవంఒక్కటే.. మార్గాలు వేరైనా భక్తిలో నిశ్చలత, ప్రేమ, సేవాభావం ఉంటేచాలు" అనే భావనతో అజ్జు చేస్తున్న ఈ కృషి స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



### - ఘనంగా నిమజ్జన శోభాయాత్ర..:

నవరాత్రి పూజల అనంతరం అమ్మవారి నిమజ్జన వేడుకలను అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సవ వాతావరణంలో జరిపిస్తుంటారు. స్థానిక ప్రజలు, యోధులు, భక్తులందరినీ ఏకతాటిపైకితెచ్చి ఈ ఉత్సవాలను విజయవంతం చేయడంలో అజ్జు చూపిస్తున్న సమర్థత దైవభక్తి పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

### -ప్రజల మెప్పు.. ఊరంతా ప్రశంసల జల్లు..:

మత సామరస్యానికి అద్దంపడుతున్న అజ్జు కృషిని రెడ్డిస్ట్రీట్ నివాసులతోపాటు జనగామ పట్టణ ప్రజలంతా ముక్తకంఠంతో ప్రశంసిస్తున్నారు. కులాలకు, మతాలకు అతీతంగా అందరినీ ఆత్మీయంగా కలుపుకుపోతూ అజ్జు సంపాదించుకున్న ఆదరాభిమానాలు నేటి సమాజానికి ఒక చక్కటి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.



# మూగజీవాల ఆకలి...! రైతన్న కంటతడి..!!

## - పశుగ్రాసం కోసం రైతన్నపాట్లు

**బచ్చన్నపేట, అక్టోబరు 25 ప్రభాతవార్త :**

కన్నబిడ్డల్లా పెంచుకున్న పశువులు ఆకలితో అలమటిస్తే ఆరైతు గుండె తట్టుకోగలదా..? నోరు తెరిచి తమ బాధను చెప్పుకోలేని మూగజీవాలకు గుప్పెడు మేతపెట్టలేని పరిస్థితి వస్తే ఆరైతన్న కళ్లలో నీళ్లు తిరగవా..? రేపటి రోజున పశుగ్రాసం దొరకదేమోనన్న ఆందోళన ఇప్పుడు పశువుల పెంపకందారులను వెంటాడుతోంది. అందుకే వరికోతలు పూర్తయిన పొలాల్లో మిగిలిన ఎండుగడ్డి కోసం పక్కజిల్లాల రైతులు సైతం బచ్చన్నపేట పరిసర ప్రాంతాలకు వచ్చి ముందుగానే కొనుగోలుచేసి తమప్రాంతాలకు తరలిస్తున్నారు.

### - పచ్చని పొలాల్లో మిగిలిన గడ్డే.. మూగజీవాలకు ప్రాణాధారం..!

రైతుకు వరిధాన్యం ఎంతముఖ్యమో పశువులకు ఎండుగడ్డి అంతేముఖ్యం. పంట చేతికొచ్చిన తర్వాత పొలంలో మిగిలేగడ్డిని కొందరు వ్యర్థంగాచూస్తే.. పశువులను పెంచే రైతుకుమాత్రం అదేబంగారం. వేసవిలో వానలు లేకపోయినా, పొలాల్లో పచ్చిక కనిపించకపోయినా ఆమూగజీవాల కడుపు నింపేది ఈ ఎండు గడ్డే!ఇప్పుడు అదే గడ్డికి గిరాకీ పెరిగింది. ఒక్క కట్టకు రూ.70నుంచి రూ.100వరకు ధర పలుకుతున్నట్లు తెలుస్తోంది. డిమాండ్ మరింతపెరిగితే ధరలుకూడా పెరిగేఅవకాశం ఉందన్న ఆందోళన



వ్యక్తమవుతోంది. దీంతో భవిష్యత్తులో మేతకొరత రాకుండా ఉండేందుకు రైతులు ఇప్పటినుంచే గడ్డిని నిల్వచేసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

### - మేత దొరక్కపోతే మూగజీవాల పరిస్థితి ఏమిటీ..?

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంపై ఆందోళనలు, రాబోయేరోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడవచ్చన్న భయాలు పశువుల పెంపకందారులను ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా చేస్తున్నాయి. కరువు వస్తుందో లేదో ఇప్పుడే చెప్పలేకపోయినా అలాంటి పరిస్థితి ఎదురైతే పశువులకు మేత సమకూర్చడం కష్టమవుతుందన్న ఆలోచనే వారిని కలవరపెడుతోంది. పశువులను అమ్ముకోలేక, పోషించలేక సతమతమయ్యే రైతు బాధ మాటల్లో చెప్పలేనిది. ఒకవైపు ఎండుగడ్డికి పెరుగుతున్న ధరలు రైతులకు కొంత అదనపు ఆదాయాన్ని అందించే అవకాశమిస్తుంటే మరోవైపు పశువులను పెంచేవారికి మేతఖర్చులు భారంగా మారే పరిస్థితి కనిపిస్తోంది. పంట పండితేనే రైతుబతుకు నిలబడుతుంది. ఆపంటతో పాటు వచ్చే గడ్డే పశువుల బతుకుకు ఆధారం.

# 28న అన్ని పాఠశాలల్లో ఈ-వేస్ట్‌పై అవగాహన

## - ఈ వ్యర్థాల సేకరణ, బాధ్యతాయుత నిర్వహణపై ప్రత్యకప్రచారం

**పభాతవార్త ప్రతినిధి, జనగామ :**

పర్యావరణ పరిరక్షణ, ఎలక్ట్రానిక్ వ్యర్థాల సురక్షిత నిర్వహణపై అవగాహన కల్పించేందుకు ఈనెల 28న జనగామ జిల్లాలోని అన్నిప్రభుత్వ, ప్రైవేటుపాఠశాలల్లో ఈ-వేస్ట్ సేకరణ, అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి సందీప్‌కుమార్ ఝా తెలిపారు.సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో "ఎకో క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్ - ప్రత్యేక ప్రచార కార్యక్రమం"లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతీపాఠశాలలో ఈ-వేస్ట్ సమన్వయ ఉపాధ్యాయుడిని నియమించి, నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లు,



కీబోర్డులు, ఛార్జర్లు, కేబుళ్లు తదితర ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి వాటి వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.మండలాల వారీగా సేకరణ కేంద్రాలను ఏర్పాటుచేసి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అధీకృత సంస్థకు వ్యర్థాలను అప్పగించాలన్నారు. ఈ ప్రక్రియలో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని, పరికరాల్లోని గోప్యసమాచారాన్ని సురక్షితంగా తొలగించాలని స్పష్టంచేశారు. కార్యక్రమ వివరాలు, ఫొటోలు, వ్యర్థాల అప్పగింతనివేదికలను నిర్దేశించిన గడువులోగా సమర్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు.ఈవ్యర్థాలను సాధారణ చెత్తలోకలపకుండా శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతీపాఠశాల సహకరించాలని జిల్లా విద్యాశాఖ కోరింది.

జనగామ వార్త



# రెచ్చగొట్టే విమర్శలు మానుకోవాలి

## - రైతుసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**దేవరుప్పుల, అక్టోబరు 25 ప్రభాతవార్త :** బిజెపి నాయకులు ప్రజలను



రెచ్చగొట్టే విమర్శలు మానుకోవాలని కాంగ్రెస్‌పార్టీ మండలఅధ్యక్షులు దావేరా అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ నాయకులు లేగ రామ్మోహన్ రెడ్డి కాంగ్రెస్‌పార్టీపై చేస్తున్న విమర్శలను ఖండించారు. లేగ రామ్మోహన్ రెడ్డి కాంగ్రెస్‌పార్టీపై విమర్శలుచేయడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలపై నిర్మాణాత్మకంగా మాట్లాడకుండా రాజకీయ విమర్శలకే పరిమితం కావడం సరికాదని హితవు పలికారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతంలో మార్పులు, వ్యవసాయ రంగంలో సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని, ఈ ప్రభావం బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని రైతులకు కూడా వర్తిస్తుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ముందుగానే అప్రమత్తం చేయడం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై సూచనలు అందించడం ప్రభుత్వాల బాధ్యత అని తెలిపారు. బీజేపీ నాయకులు ప్రజలను రెచ్చగొట్టే విధంగా విమర్శలు చేయకుండా తమపాలనలో ప్రజలకు, రైతులకు ఏంచేశారో ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లానాయకులు కాసారపు ధర్మారెడ్డి, ఉప్పల సురేష్ బాబు, ఎండి.షబ్బీర్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు ఇనుముల నాగరాజు, ఎస్టీసెల్ అధ్యక్షుడు భూక్య సజ్జన్, ఒడపల్లి రవి, బోనగిరి యాకస్వామి, నల్ల యాదగిరి, జక్కుల గంగరాజు, ధరావత్ యాకన్న, మేడ సాగర్, దొపతినర్సయ్య, నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పులప్రకాష్, ఎన్‌ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్, శ్రీను, దేవేందర్, నగేష్, కాడబోయిన సోమన్న, చింత ఉపేందర్, జిలుకర కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్‌ను కలిసిన ఆదర్శయువ మండలి కార్యవర్గం

**దేవరుప్పుల, అక్టోబరు 25 ప్రభాతవార్త :** దేవరుప్పుల మండలంలోని పెద్దమదూరుగ్రామంలో ఇటీవల ఆదర్శ యువమండలి నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బండ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం కార్యవర్గ సభ్యులు బిఆర్ఎస్‌పార్టీ జిల్లానాయకులు ప్రముఖ పారిశ్రామికవేత్త బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ ను హైదరాబాదులోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వక కలిసి శాలువాకప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఆదర్శ యువమండలి అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌గౌడ్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపి వారిని సన్మానించారు. ఆదర్శ యువమండలి అభివృద్ధికి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానని హామీఇచ్చారు. ఆదర్శ యువమండలికి పూర్వ వైభవం తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చంద్రగిరి సంపత్‌గౌడ్, ఆదర్శ యువమండలి గౌరవసభ్యులు నాయకపు శేఖర్ గౌడ్, గోరుపెల్లి సంపత్‌రెడ్డి, యువమండలి ఉపాధ్యక్షులు జంకాల వినయ్, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ కొంతం నాగరాజు, యూత్ కమిటీ సభ్యులు గోడిశాల శివ, బండ రాజు, కారుపోతుల హరీష్, కర్రె ఉపేందర్, నారెడ్డి వేణు, గోడిశాల శివ తదితరులు పాల్గొన్నారు.



## కరెంటు లేక ఎండిపోతున్న పంటలు

నర్సంపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త:



పంటలకు సరైన విద్యుత్ సరఫరా లేక ఎండిపోతున్నాయని బిఆర్ఎస్ పార్టీ క్లస్టర్ ఇంచార్జి మోటూరి రవి అన్నారు. ఆదివారం మండలంలోని గురిజాల గ్రామంలో బి.ఆర్.ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బావుల కింద ఎండిపోతున్న పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రవి మాట్లాడుతూ గురిజాల లో చాలా మంది రైతులు వరి మరియు ఇతర పంటలు సాగు చేశారని నీళ్ల లేక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వము స్పందించి ఎలాంటి కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలని రైతులను ఆదుకోవాలని కోరారు.ప్రభుత్వం వెంటనే స్పందించి అధికారుల ద్వారా సర్వే చేయించి నష్టపరిహారం రైతులకు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు చిన్నపెల్లి నరసింగం,మాజీ ఎంపీటీసీ లు గడ్డం కొమురయ్య,బండారి రమేష్,బండారి చిన్న వెంకటేశ్వర్లు,మాజీ రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ అన్న రాజమల్లు,మండల పార్టీ ఉప అధ్యక్షుడు అల్లి రవి,గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు మంచిక దేవేందర్,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పత్తి కుమారస్వామి,యూత్ మండల ప్రధాన కార్యదర్శి సంగం శ్రీకాంత్,సీనియర్ నాయకులు బండారి మల్లయ్య,కొమ్మ రవి,యశోద నర్సింగం,ఆరె సుధాకర్,శ్రీరామోజు మధుకర చారి,పుంజాల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన బాలికల నూతన వసతి గృహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త: పట్టణంలో నూతనంగా



నిర్మించిన గిరిజన బాలికల వసతి గృహాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలోని గిరిజన సంక్షేమ వసతి గృహంలో విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా గదులు సరిపోకపోవడాన్ని గుర్తించి, వారి సౌకర్యార్థం రూ.2 కోట్ల వ్యయంతో నూతన వసతి గృహాన్ని నిర్మించినట్లు తెలిపారు.ప్రస్తుతం గిరిజన బాలికల వసతి గృహంలో సుమారు 300 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారని, వారికి సరిపడా వసతి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో నూతన భవనాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ వసతి గృహం అందుబాటులోకి రావడంతో విద్యార్థినులకు మెరుగైన వసతి సౌకర్యాలు లభిస్తాయని, వారు ప్రశాంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించేందుకు దోహదపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం లక్ష్మీరామానంద్, ఆర్డీవో ఉమారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్లు పాలాయి శ్రీనివాస్,రావుల హరీష్ రెడ్డి,మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గంధం నరేందర్, కౌన్సిలర్లు,పార్టీ ముఖ్య నాయకులు సంబంధిత అధికారులు, గిరిజనులు సంక్షేమ శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక

నర్సంపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త: మండలంలోని ఆకులతండా గ్రామంలో యాదవ సంఘం పెద్దమనుషుల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కూకట్ల కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా కన్నెబోయిన శ్రీశైలం, కార్యదర్శిగా గోపు పెద్ద మల్లేష్, కోశాధికారి వంగ సమ్మయ్య, ముఖ్య సలహాదారులు బోయిని సమ్మాలు, కన్నెబోయిన రాజన్న , కూకట్ల ప్రకాష్ సలహాదారులుగా పై వారిని సంఘ సభ్యులందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం తెలిపారు.



## ఓటరు నమోదుపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

నర్సంపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త:



తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి ఓటరు నమోదుపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పులి దేవేందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ, మహబూబ్‌నగర్ -రంగారెడ్డి-హైదరాబాద్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో, డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు నమోదు చేసుకోవడానికి 2026 నవంబర్ 6 చివరి తేదీ అని పేర్కొంటూ, అర్హులైన గ్రాడ్యుయేట్లు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా హనుమకొండలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యావంతులు ఓటు ఎంతో విలువైనది. నా ఒక్క ఓటుతో ఏమవుతుందిలే అనే నిర్లక్ష్య ధోరణిని విడనాడాలి.ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకూ ప్రాధాన్యత ఉంటుంది. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని, తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు.బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు తమ పరిధిలో ఉన్న గ్రాడ్యుయేట్లను చైతన్యపరిచి, ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బగ్గి రాజు, నీరటి రాజు, మధు, రాసమల్ల రాజేందర్, లక్ష్మణచారి, హరి లు తదితరులు పాల్గొన్నారు.

## మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం

చెన్నారావుపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త:



మండలంలోని ముగ్గంపురం గ్రామంలో స్నేహితుడి కుటుంబానికి తోటి మిత్రులు ఆర్థిక చేయూతనందించారు. ముగ్దంపురం గ్రామానికి చెందిన ఎస్ఎస్సీ 1995-96 బ్యాచ్ చెన్నారావుపేటకు చెందిన ఆరెల్లి ప్రభాకర్ తండ్రి ఆరెల్లి యాకయ్య (78) ఈనెల 16న, అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా ఆదివారం స్నేహితుడి కుటుంబాన్ని తోటి మిత్రులు పరామర్శించారు. తొలుత యాకయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా తోటి మిత్రులు రూ. 15,600ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు పాతముగ్గంపురం గ్రామ సర్పంచ్ ననుమాస కరుణాకర్ గౌడ్, పెండ్యాల ప్రభాకర్, కుండె కుమారస్వామి, సంకటి రాజేంద్రప్రసాద్, చల్ల రాజు, గట్ల రాంబాబు, నన్నెబోయిన కుమారస్వామి, వెల్దండి మధు, అమ్మ రవి, కోల రమేష్, శ్రీనివాస్, రమేష్, అనిల్, వీరభద్రయ్య, అశోక్, రాజు ఉన్నారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ

నెక్కొండ, అక్టోబర్ 25, ప్రభాతవార్త: మండల కేంద్రానికి చెందిన జన్ను మధు అకాల మరణం చెందడం బాధాకరమని తెలంగాణ పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు, నెక్కొండ మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్ అన్నారు.జన్ను మధు మృతి విషయం తెలుసుకున్న గటిక అజయ్ కుమార్ ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని భార్య జన్ను స్వప్నతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సరోజన హరికిషన్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ దొనికెన సారంగపాణి, బంజరుపల్లి మాజీ సర్పంచ్ రవి, నెక్కొండ వార్డు సభ్యులు కందికొండ ఉమా వెంకన్న, మైదం సురేష్ తదితరులు పాల్గొని మృతునికి నివాళులర్పించారు.






## రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించిన హరిహరనామ స్మరణ సంగం సభ్యులు

నల్లబెల్లి, అక్టోబర్ 25, ప్రభాతవార్త: నల్లబెల్లి మండల కేంద్రంలోని శ్రీ



రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని హైదరాబాదు పట్టణానికి చెందిన హరిహరనామస్మరణ సంఘం సభ్యులు ఆదివారం సందర్శించారు. రామప్ప దేవాలయం వరంగల్ పట్టణంలోని భద్రకాళి దేవాలయం హనంకొండ పట్టణంలోని వేయి స్తంభాల దేవాలయాన్ని సందర్శించిన అనంతరం నల్లబెల్లి మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు వీరికి దేవాలయం అర్చకులు పెండోట మురళీమోహన్ ఆచారి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాద వితరణ చేపట్టారు. హరిహర నామస్మరణ సంఘం చైర్మన్, బసవన్న, అధ్యక్షులు సోమా నాగరాజు, ప్రధాన కార్యదర్శి సిద్దిపేట మరోల్లి హనుమంతరావు, లకు ఆలయ అర్చకులు తో పాటు దేవాలయ శాశ్వత ధర్మకర్తలు తాటిపల్లి రవీందర్, సుదర్శన్ లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెవైఎం మండల అధ్యక్షుడిగా వంశీ

చెన్నారావుపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

బిజెపి అనుబంధ బిజెవైఎం మండల అధ్యక్షుడిగా మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన మేడి వంశీ నియమితులయ్యారు. ఈ మేరకు బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి డా.గోగుల రాణాప్రతాప్‌రెడ్డి సహకారం, ప్రోత్సాహంతోనే తాను ఈ స్థాయికి వచ్చానన్నారు. ఇందుకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రధాని నరేంద్రమోది చేస్తున్న అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. యువ కార్యకర్తల ఐక్యతతో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. పార్టీ చేపట్టే కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్నారు.

## ఏటీసీ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త:



నర్సంపేట నియోజకవర్గానికి మంజూరైన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటులో భాగంగా నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ప్రతిపాదిత స్థలాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారద పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.45 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో సెంటర్ భవన నిర్మాణంతో పాటు అవసరమైన ఆధునిక సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఏటీసీ సెంటర్ అందుబాటులోకి వస్తే స్థానిక యువతకు వివిధ రంగాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నైపుణ్య శిక్షణ పొందే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ ద్వారా యువత తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సాధించేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో తీవ్ర కష్టాల్లో ప్రజలు



–పట్టభద్రులు ఓటునమోదు చేసుకోవాలి

**మహబూబాబాద్ ప్రతినిధి,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు నీరు, నిధులు, ఉద్యోగాలు అందక తీవ్ర ఇబ్బందుల్లో కూరుకపోయారని బీఆర్ఎస్ పార్టీ మాజీమంత్రి సత్యవతిరాథోడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లాలోని కురవి మండలం పెద్దతండాలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక, సామాన్య ప్రజలకు ఉపాధి లేక, రైతులకు సాగునీరు అందక, ప్రజలకు త్రాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. అక్టోబర్ నెలలో కూడా విద్యుత్ కోతలు, నీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ముందస్తు ప్రణాళికతో సమస్యలు ఎదుర్కోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యదోరణి అవలంభిస్తుందన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలు సామాన్య ప్రజల జీవితాలను భారంగా మార్చాయని, సన్నబియ్యం ధరలు పెరుగడంతో పేద, మద్యతరగతి కుటుంబాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

**–బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకై కృషిచేయాలి:**

జిల్లాలోని పట్టభద్రులందరూ తప్పకుండా ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేసుకొవాలని సూచించారు. త్వరలో జరుగబోయే పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీరాంనాయక్, మండలపార్టీ నాయకులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు

–ఉద్యోగాలు లేవు.. ఉపాధి లేదు.. కరెంటు, నీళ్ల లేవు

–మాజీ ఎంపీ మాలోతు

**మరిపెడ, అక్టోబర్25,ప్రభాతవార్త:** మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని నవీన్‌రావు గెస్ట్‌హౌస్‌లో చిన్నగూడూరు, సీరోల్ మండలాల బీఆర్ఎస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోతు కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక, ప్రజలకు సక్రమంగా తాగునీరు, విద్యుత్ సరఫరా అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. అక్టోబర్ నెలలో కూడా విద్యుత్ కోతలు, నీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ముందస్తు ప్రణాళికతో సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. గోదావరిలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజలకు, రైతులకు అవసరమైన విధంగా వినియోగించలేకపోతున్నారని విమర్శించారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్ల ఏర్పడిన పరిస్థితి అని ఆరోపించారు. ప్రజలకు విద్యుత్, తాగునీరు, సాగునీరు అందించడంతో పాటు నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పట్టభద్రులు ఓటరుగా



నమోదు చేసుకోవాలిరాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి, కేసీఆర్ నాయకత్వంలోని ప్రజారంజక పాలనను తిరిగి తీసుకురావాలని మాలోతు కవిత పిలుపునిచ్చారు. పట్టభద్రులు, విద్యావంతులు, మేధావులు ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, నవంబర్ 6వ తేదీ వరకు వేచి ఉండకుండా గడువులోగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. మహబూబాబాద్ జిల్లాలోని పట్టభద్రులు ఓటు నమోదు ప్రక్రియను బాధ్యతగా తీసుకుని, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఎన్నికల్లో పార్టీ బలాన్ని, ఐక్యతను చాటాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు, సర్పంచులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఐపీఎస్ అధికారిని వరించిన అమ్మవారి శేష వస్త్రం

**బయ్యారం,ప్రభాతవార్త,అక్టోబర్25:**



బయ్యారం మండలంలోని శ్రీ కోదండరామాలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శాకంబరి దేవి అమ్మవారికి అలంకరించిన శేష వస్త్రం లక్కీ డ్రా ద్వారా హైదరాబాద్‌కు చెందిన ఐపీఎస్ అధికారి చల్ల సృజన ప్రవీణ్ కుమార్ రెడ్డిని వరించింది. ప్రస్తుతం ఆయన సీబీఐలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయ అర్చకులు సుదర్శనాచార్యులు అమ్మవారి శేష వస్త్రాన్ని చల్లా సృజన ప్రవీణ్‌రెడ్డికి అందజేశారు. అమ్మవారి శేష వస్త్రం తమ మిత్రునికి లభించడం పట్ల ఐపిఎస్ అధికారి సన్నిహితులు, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

## రోడ్డుకి ఇరువైపులా ముళ్ళ పొదలు తొలగింపు

**గార్ల, అక్టోబర్25,ప్రభాతవార్త:**



రోడ్డుకి ఇరువైపులా పెరిగిన ముళ్ళ పొదలు, పిచ్చి మొక్కలను పెద్ద కిష్టాపురం సరపంచ్ గంగావత్ రాంసింగ్ నాయక్ పంచాయతీ సిబ్బందితో తొలగించారు. చంద్రగిరి ఆవాస గ్రామం ఆర్ అండ్ బి రోడ్ నుండి సీతంపేట క్రాస్‌రోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపులా ముళ్ళ పొదలను జెసిబీ, డోజర్ సహాయంతో తొలగించడం జరిగింది. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ళ పొదలు,పిచ్చి మొక్కలు వాహనదారుల ప్రయాణంలో ఇబ్బందిగా ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తగా తొలగించి శుభ్రం చేయించడం జరిగిందని సర్పంచ్ పేర్కొన్నారు. చంద్రగిరి ప్రజలు, వాహణదారులు సర్పంచ్ రామ్‌సింగ్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శివ, వార్డు సభ్యులు హరిప్రసాద్, గ్రామ పెద్దలు హుస్సేన్, మియా, చరణ్, ఎల్లయ్య, పెద్ద కిష్టాపురం యూత్ సభ్యులు మహేందర్, పండు, బాలకృష్ణ, వేణు తదితరులున్నారు.

## వైకుంఠధామాల్లో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

–సర్పంచ్ శాంతి కిషన్ నాయక్



**బయ్యారం,ప్రభాతవార్త,అక్టోబర్25:** బయ్యారం మేజర్ గ్రామపంచాయతిలో బయ్యారం ఎస్సీ కాలనీ సమీపంలో,రంగాపురం కాకతీయనగర్ పరిధిలోని రెండు వైకుంతధామాల్లో ఉన్న బోర్లను సర్పంచ్ శాంతి కిషన్ నాయక్,పంచాయతీ సెక్రటరీ రాంబాబు ఆదివారం పరిశీలించి నీటి లభ్యతను తనిఖీ చేశారు.బోర్ల పనితీరును పరీక్షి ంచిన అనంతరం వాటికి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని గుర్తించారు.రెండు బోర్లను పునరుద్ధరించి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ శాంతి కిషన్ నాయక్ తెలిపారు.నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి,వైకుంతధామాలకు వచ్చే ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మహబూబాబాద్ వార్త



మహబూబాబాద్, తొర్రూరు


## అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

–ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వినూత్న నిరసన



**మహబూబాబాద్ టౌన్,అక్టోబర్25,ప్రభాతవార్త:** తమ డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టిన నిరవదిక సమ్మె ఆదివారినికి 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహానికి డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ఆరోగ్య కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తూ ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందిస్తున్న ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలన్నారు. ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. 5శాతం వార్షిక ఇంక్రిమెంట్, మహిళలకు 180రోజుల ప్రసూతి సెలవులు, ఈహెచ్‌ఎస్ హెల్త్ ఇన్సూరెన్స్ తదితర డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే సంబందిత అధికారులతో చర్చించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉమాకర్, శ్రీకాంత్, వసుమతి, సబితారాణి, వాణి,మమత, సుజాత, నర్సింహ, స్వప్న, మలిత, అనిల్, నవీన్, పవన్, శేషాద్రి, వనిత,సునిత, అరుణ, జ్యోతి,సరిత, లలిత, విజయ, ప్రమీల, పద్మ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## గడ్డిమందు తాగి వ్యక్తి మృతి

**మహబూబాబాద్ రూరల్,అక్టోబర్25,ప్రభాతవార్త:** గడ్డిమందు తాగి ఎంజిఎంలో చికిత్స పొందుతూ వ్యక్తి మరణించిన సంఘటన మండలంలోని సింగారం శివారు ఇస్లావత్ తండాలో చోటుచేసుకుంది. మృతుని తల్లి ఇస్లావత్ బద్రి ఇచ్చిన పిర్యాదుమేరకు తన పెద్దకుమారుడు ఇస్లావత్ శ్రావణ్(19) కులీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడని వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో కూల్‌డ్రింక్‌లో గడ్డిమందు కలుపుకొని తాగగా చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజిఎంకు తరలించినట్లు తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించినట్లు పిర్యాదు పెర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న హెడ్‌కానిస్టేబుల్ అజయ్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పిఆర్‌సి అమలు చేయాలి



**మహబూబాబాద్ టౌన్,అక్టోబర్25,ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామి మేరకు తక్షణమే పిఆర్‌సిని అమలు చేయాలని టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత కోరారు. ఆదివారం టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు బిక్షపతి అధ్యక్షతన శాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ తక్షణమే పిఆర్ఎస్ అమలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. టిజిఈ జెఎసికి ఇటీవల కాలంలో ఇచ్చిన హామి మేరకు పిఆర్‌సి కమిటీ నివేదిక ఇప్పటి వరకు తెప్పించుకోకపోవడం బాధాకరం అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్,ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, చుంచు శ్రీశైలం,సువర్ణ, ఉపేందర్, సాయిబాబా,కిషన్, విష్ణువర్ధన్, వీరయ్య, గిరిజతో పాటు 150మందికి పైగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తొర్రూరు వార్త

## బీమాతో కుటుంబానికి ఆర్థిక భరోసా!

నర్సింహులపేట, అక్టోబర్ 25 ప్రభాతవార్త:



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంతో ప్రతి కుటుంబ సభ్యుడిని కోల్పోయిన కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తుందని సిఎఫ్ఎల్ కౌన్సిలర్ మై పాషా అన్నారు. ఆదివారం నర్సింహులపేట మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన దుండి ఉప్పలయ్య పేరు మీద స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పాలసీ తీసుకున్నారు. ఈ క్రమంలో ఆయన భార్య దుండి మంజుల 2025 ఫిబ్రవరి 12న ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. బీమా నిబంధనల ప్రకారం క్లెయిమ్ ప్రక్రియ అనంతరం రూ. 2 లక్షల పరిహారం అందించారు. ఈ సందర్భంగా దుండి మంజుల మాట్లాడుతూ తమ కుటుంబానికి ఈ నగదు ఎంతో ఆసరాగా నిలుస్తుందని హర్షం వ్యక్తం చేశారు. కష్టకాలంలో ఆర్థిక సహాయం అందించిన బీమా పథకానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ మహేష్ మాట్లాడుతూ ..ప్రతి ఒక్కరూ ప్రమాద బీమా పథకాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అర్హులైన వారు బ్యాంకు ద్వారా బీమా పథకాల్లో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సింహులపేట సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు పాషా, శ్రీను, జ్యోతిష్‌తో పాటు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ జెట్టి యాకయ్య పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమం

నర్సింహులపేట, అక్టోబర్25 ప్రభాతవార్త:



వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటును నమోదు చేసుకోవాలనే లక్ష్యంతో జయపురం గ్రామంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం నర్సింహులపేట మండలంలోని జయపురం గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు చుక్క వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ..పట్టభద్రుల ఓటు ప్రజాస్వామ్యంలో కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని పట్టభద్రులను గుర్తించి, ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన ధ్రువపత్రాలు సిద్ధం చేసుకునేలా సహకరించాలని నాయకులు పిలుపునిచ్చారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి అర్హుడైన పట్టభద్రుడి ఓటు నమోదు అయ్యేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బాలిని ఐలయ్య, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చిర్ర సతీష్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి వెంకన్న వెంకట్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు తోట సురేష్, గ్రామ సర్పంచ్ రేణుక, అశోక్ రెడ్డి, ఉప్పలయ్య, వెంకన్న మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్బిఐ మినీ బ్యాంకు సేవలు ప్రారంభం

నెల్లికుదురు అక్టోబర్ 25 ప్రభాతవార్త:



మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామంలో గడ్డం వేణు నూతనంగా ఏర్పాటుచేసిన ఎస్బిఐ మినీ బ్యాంకు సేవలను స్థానిక సర్పంచ్ గుండెబోయిన ఉష అశోక్ చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎర్రబెల్లి గూడెం ఉమ్మడి గ్రామపంచాయతీ ప్రజానీకానికి బ్యాంకు సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం అన్నారు బ్యాంకు సేవల కొరకు సుమారు 12 కిలోమీటర్లు నెల్లికుదురు మండల కేంద్రానికి వెళ్లడానికి ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారని గ్రామంలో మినీ బ్యాంకు సేవలు ప్రారంభించి వారి ఇబ్బందులను తొలగించడం శుభ పరిణామం అన్నారు ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు, ఈ కార్యక్రమంలో బడి తండ సర్పంచ్ ధనమ్మ అమ్రు, సౌళ్ళ తండా సర్పంచ్ సుజాత వాసు, మాజీ సర్పంచ్ బండారు మల్లయ్య, ఉప సర్పంచ్ లు, మాజీ చైర్మన్ దేవేందర్ రావు, వార్డు మెంబర్లు అశోక్, విజేందర్, గ్రామస్తులు సతీష్ రావు, గడ్డల అశోక్, బాలకృష్ణ, గడ్డం కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా ప్రభుత్వ పాలన

నెల్లికుదురు అక్టోబర్ 25 ప్రభాతవార్త:



రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా పాలన కొనసాగిస్తుందని మండలంలోని మునిగల వీడు సర్పంచ్ బొల్లికొండ చైతన్య నాగరాజు అన్నారు ఆదివారం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి స్లాబ్ నిర్మాణ పనులను ఇందిరమ్మ కమిటీ సభ్యుల తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజు యాదవ్, శ్రీరంగం శ్రీనివాస్, భూక్యా దేవినవీన్, ఇస్సంపల్లి రాములు, ఉపేందర్, బొల్లికొండ పెద్దవెంకటయ్య, చిన్న వెంకటయ్య, బాలరాజు, రాజశేఖర్, బొజ్జ రాములు గడ్డమీది వెంకటయ్య, మురగుండ్ల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదుపై ఇంటింటా ప్రచారం

నర్సింహులపేట, అక్టోబర్25 ప్రభాతవార్త:

వరంగల్ ఖమ్మం నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల యూత్ అధ్యక్షుడు బండి రమేష్ ఆధ్వర్యంలో ఇంటింటా పర్యటించి అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండ బిక్షం రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు కొండబత్తిని జగదీశ్వర్, మాజీ ఎంపిటిసి సభ్యుడు మిర్యాల వెంకన్న, మాజీ ఉప సర్పంచ్ కర్ల నాగన్న, సీనియర్ నాయకులు మంద వెంకన్న, సంకపల్లి నరసింహారెడ్డి, వార్డు సభ్యులు ఎల్లావుల ఉపేందర్, మాజీ వార్డు సభ్యులు ఎండి మదర్, నకరకంటి శివప్రసాద్, కల్లెడ మధు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తను పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు

నర్సింహులపేట, అక్టోబర్ 25 ప్రభాతవార్త:



మండల కేంద్రానికి చెందిన సుంకరి సాంబయ్య అనారోగ్యంతో ఉండగా బిఆర్ఎస్ నాయకులు ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ఆయనకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న కార్యకర్తలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండ బిక్షం రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మిర్యాల వెంకన్న, మాజీ మండల యూత్ అధ్యక్షుడు బండి రమేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు కొండబత్తిని జగదీశ్వర్, సీనియర్ నాయకులు సంకపల్లి నరసింహారెడ్డి, మంద వెంకన్న, ఉప సర్పంచ్ కర్ల నాగన్న, వార్డు సభ్యులు ఎల్లావుల ఉపేందర్, ఎండి మదర్, నకరకంటి శివప్రసాద్, కల్లెడ మధు తదితరులు ఉన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

కేసముద్రం, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

కేసముద్రం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ట్రెజరర్ లయన్ మడిపెద్ది వెంకటేష్ అధ్యక్షతన ఉచిత కంటి పరీక్షల కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కాలేరు సత్యనారాయణ సౌజన్యంతో 20 మందికి కంటి పరీక్షలు నిర్వహించి , వారిలో ఇద్దరికి కంటి శస్త్రచికిత్స అవసరాన్ని గుర్తించి అందుకు అవసరమైన ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యర్నం శ్రీరాములు మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడమే క్లబ్ లక్ష్యమన్నారు. ప్రజాసేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం పై పెరుగుతున్న వ్యతిరేకత..

### - మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

గూడూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త:



రాష్ట్రంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనపై అన్ని వర్గాల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వస్తున్నదని, రాష్ట్రంలో పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు బిఆర్ఎస్ శ్రేణులు కృషి చేయాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గూడూరులో ఆదివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా బిఆర్ఎస్ ప్రభుత్వం ముందు చూపుతో చేపట్టిన కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల ను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలు నేడు ఎదుర్కొబోతున్న కరువుకు కారణమైందని, ఇది ఎల్నినో కరువు కాదని...కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు అని అన్నారు. ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు వారు అడగకముందే జీతాలు పెంచిన ఘనత కెసిఆర్ ప్రభుత్వానిదన్నారు. రాష్ట్రంలో పోలీసు శాఖను బలోపేతం చేయడానికి బిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత నుంచి ఉన్న వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని బిఆర్ఎస్ శ్రేణులు ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరును కలిసి ప్రభుత్వ వైఫల్యాల గురించి వివరించాలని, ఓటర్ నమోదు కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి ఎండి కాసిం, రాష్ట్ర నాయకుడు భరత్ కుమార్ రెడ్డి, సంపత్ రావు, వేణుగోపాల్ రెడ్డి, సురేందర్, వేణుమాధవరెడ్డి, ఎల్లయ్యలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కురుమ సంఘం అధ్యక్షుడిగా మల్లేశం

గూడూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త:



కురుమ సంఘం మండల అధ్యక్షుడిగా పట్టణంలోని గొల్లగూడెం ప్రాంతానికి చెందిన మండల మల్లేశం ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పొనుగోడు గ్రామానికి చెందిన పోతరాజు రవికుమార్, ఉపాధ్యక్షులుగా కోరే గౌరయ్య, కాలే కుమారస్వామి, కోశాధికారిగా బీర శ్రీనివాస్ లను ఎన్నుకున్నట్లు కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు బీర అశోక్, ఎన్నికల అధికారి గా వ్యవహరించిన బీర బిక్షపతి ప్రకటించారు. ఆదివారం స్థానిక బీరప్ప ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మండల కురుమల సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఉపేందర్, కోరేపాపయ్య, దేవేందర్, మండల కొమురయ్య, మంగ చేరాలు, బీర శ్రీనివాస్, కోరె అనిల్, మెట్టు వీరస్వామి, మంగ మహేందర్, రామ్మూర్తి, కుమారస్వామి, రాజయ్య, కర్రె యాకయ్య పాల్గొన్నారు.

## పార్టీ కార్యాలయంలో హెల్ప్ డెస్క్

గూడూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త:



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ నమోదు కార్యక్రమం కొరకు గూడూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధారావత్ బాలాజీ నాయక్ తెలిపారు. గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోనిఅప్పరాజపల్లి, జగన్నాయకుల గూడెం, బొద్దుగొండ, కొల్లాపురం, గోవిందాపురం గ్రామాల్లో పర్యటించి హెల్ప్ డెస్క్ గురించి వివరించినట్లు తెలిపారు. 2023 కంటే ముందు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాధవపెద్ది రమేష్ చందర్ రెడ్డి, బుల్లి కొండ మధు, నరేష్ రెడ్డి, యాకయ్య, వీరస్వామి, సర్పంచులు అజ్మీర భరత్, బంద కృష్ణ, సత్తెమ్మ బాసు తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ గుడికి వెంటనే స్థలం కేటాయించాలి

గూడూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

గూడూరులో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణం కొరకు అవసరమైన స్థలాన్ని స్థానిక సర్పంచ్ వెంటనే కేటాయించాలని సేవాలాల్ గుడి నిర్మాణ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆదివారం స్థానిక సర్పంచ్ వాంకుడోత్ సునీతకొమ్మాలునాయక్ ను కలిసిన ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. మండలంలో ముందుండి అన్ని పండుగలను ఘనంగా నిర్వహిస్తున్న సర్పంచ్ బంజారా జాతి ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణ స్థలం కేటాయింపు విషయంలో జాప్యం చేయవద్దన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆలోచించి, ఇచ్చిన హామీ ప్రకారం వారం రోజుల్లోగా సేవాలాల్ గుడి నిర్మాణానికి గూడూరు మెయిన్ రోడ్డులో అనువైన స్థలాన్ని కేటాయించాలని, లేనిపక్షంలో మండలంలోని వేలాది మంది లంబాడీలతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో వాంకుడోత్ గోపీనాథ్, ఆంగోతు ధర్మా, భూక్య బాలు, బానోత్ లక్ష్మణ్, హంసావత్ శ్రీనివాస్, బానోత్ నరసింహ, బోడ రాజు, సునావత్ వీరన్న, జాటోత్ వివేకానంద కుమార్, బానోత్ పూల్ సింగ్, బోడ మంజీలాల్, వీరన్న, అజ్మీర సురేష్, సునావత్ రాహుల్, రవి పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిక

కొత్తగూడ అక్టోబర్ 25 ప్రభాతవార్త:



మండలం లోని దుర్గారం గ్రామం నుండి కాంగ్రెస్ వైపు క్యూ కట్టిన బిఆర్ఎస్ నాయకులు కున్సోత్ రమేష్, దబ్బేటి రమేష్, జాటోత్ జుమ్మిలాల్, బోడ హేమ్లా కార్యకర్తలకు మండల అధ్యక్షుడు బానోతు రూపుసింగ్ హస్తం కండువా కప్పి సాధరంగా ఆహ్వానించారు. దుర్గారం గ్రామానికి చెందిన పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజానుకూల విధానాలు, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రూపుసింగ్మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ లోకి వస్తున్నారని తెలిపారు. దుర్గారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ ముఖ్య నాయకులు కాంగ్రెస్ లో చేరడం వల్ల ఆ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమైందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ప్రాధాన్యత ఉంటుందని, రాబోయే రోజుల్లో పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత పటిష్టం చేయడానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య, రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ చల్ల నారాయణ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకర బోయిన మొగిలి, మండల నాయకులు బిట్ల శ్రీనివాస్, ఇర్ప రాజేశ్వర్, కాయితోజు ఉపేంద్ర చారి, వజ్జ సాగర్, బోడ మోహన్, స్వప్న, విజేందర్, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

గూడూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త:




ఎల్నినో ప్రభావంతో ఈసారి సకాలంలో వర్షాలు కురువక పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఎంసీపిఐయు కేంద్ర కమిటీ సభ్యుడు పానుగంటి నర్సయ్య విజ్ఞప్తి చేశారు. గూడూరులో ఆదివారం జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరువు నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి, రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని, రైతులకు ఎకరానికి రూ.50వేలు, కూలీలకు నెలకు రూ.12వేల చొప్పున అందజేయాలని, వలసలు ఆపాలని, వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నందున విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బానోతు లాలు, అరకాల స్వామి, బానోత్ బాలు పాల్గొన్నారు.




## భారత విప్లవోద్యమంలో అమరుల త్యాగాలను స్మరించుకుందాం

కొత్తగూడ అక్టోబర్ 25 ప్రభాతవార్త:



విప్లవ ఉద్యమంలో అమరుల త్యాగాలను స్మరించుకుందామని నవంబర్ 1నుండి 9 వరకు అమరవీరుల సభలను గ్రామ గ్రామాన విస్తృతంగా జరపాలని ఆదివారం స్థానిక సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ కామ్రేడ్ పాలడుగు కృష్ణ స్మారక భవనం ఆవరణం ముందు అమరవీరుల వాల్ పోస్టర్స్ ను ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సిపి(ఎంఎల్) న్యూడెమోక్రసీ గూడూరు డివిజన్ కార్యదర్శి సూర్యం మాట్లాడుతూ భూమి భుక్తి పేద ప్రజల విముక్తి కోసం కొనసాగిన గోదావరి లోయ ప్రతిఘటన పోరాటంలో అమరులైన విప్లవ వీరులకు జోహార్లు అర్పిస్తూ నవంబర్ 1 నుండి 9 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్స వాల సందర్భంగా గ్రామ గ్రామాన సభలను విస్తృతంగా జరపాలని వారు అన్నారు. అదేవిధంగా నవంబర్ 7న కొత్తగూడ మండల కేంద్రంలో జరుగు కామ్రేడ్ పాలడుగు క్రిష్ణ స్మారక బహిరంగ సభను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పుల్లన్న, శ్రీశైలం, బూర్కా బుచిరాములు, పూర్ణచందర్, సోమన్న, ప్రభాకర్ (రాయుడు), నిర్మల, జామ్లా సువర్ణపాక నర్సయ్య, నాగేష్, రాజా, జిట్టబోయిన రామచంద్రు, వినేష్, సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

## సూర్య స్వచ్ఛంద సేవ ఆధ్వర్యంలో కంటి పరీక్ష శిబిరం

గంగారం అక్టోబర్ 25, ప్రభాతవార్త:



మండల కేంద్రం లో ఉత్పత్తి దారుల సహకార సంఘం ఛైర్మెన్ బుర్కా యాదగిరి సంగం డైరెక్టర్ల ఆధ్వర్యం లో ఆదివారం మహబూబాబాద్ జిల్లా కు చెందిన సూర్య స్వచ్ఛంద సేవా ట్రస్ట్ తరపున కంటి పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు ఈ శిబిరం లో పలు గ్రామాల నుండి ప్రజలు పాల్గొని కంటి పరీక్షలు చేసుకున్నారు కంటి పరీక్షలు చేసుకున్నవారిలో కంటి ఆపరేషన్ అవసరం ఉన్నవారిని గుర్తించి సోమవారం మహబూబాబాద్ లో ఫ్రీగా నిర్వహిస్తామని కంటి డాక్టర్ మధు తెలిపారు ఈ కార్యక్రమం లో సర్పంచ్ జజ్జారి రాము డైరెక్టర్లు బచ్చల వెంకన్న పులసం లింగస్వామి, దుర్గం ప్రభాకర్ ,జోగ రామయ్య పెనుక లక్ష్మీ నర్సు చందు జజ్జారి వసంత తదితరులు పాల్గొన్నారు

## గంగారం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

గంగారం, అక్టోబర్ 25, ప్రభాతవార్త:




గంగారం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సిపిఎం ఏరియా కమిటీ కార్యదర్శి నక్క సైదులు కోరారు. మండలంలోని మామిడిగూడెం గ్రామంలో గాదర్ల నరేష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్నినో ప్రభావం వల్ల సరైన సమయంలో వర్షాలు రాకపోవడంతో వేసిన పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయని, ఏజెన్సీ ప్రాంతంలో ప్రధాన పంటలైన వరి, మొక్కజొన్న పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయని, జొన్నల దిగుబడి ఎకరానికి 10 నుండి 15 క్వింటాల్ కంటే ఎక్కువగా వచ్చే పరిస్థితి లేదని, రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదన్నారు. ఒక ప్రక్క కరువు మరొక పక్క విద్యుత్ కోరతల వల్ల రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు దాపురించాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, గోదావరి జలాలను పాకాల చెరువుకు తరలించి లిఫ్టు ద్వారా ఉమ్మడి కొత్తగూడ గంగారం మండలాలకు సాగు త్రాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని, ఎండిన పంటలను పరిశీలించి ప్రభుత్వం ఎకరానికి రూ.30 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు జనగం వీరస్వామి, దుర్గం లక్ష్మయ్య, గాధర్ల నరేష్, జనగం యాకన్న, కల్తీ సారక్క, ఈసం ప్రవీణ్ కుమార్, బోయిని ఐలయ్య, సోలం పద్మ, గణేష్, రాము, వెంకన్న, కుమార్, ఏకాంబరం పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి




నర్సంపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఆదివారం నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఐఏఎస్, నర్సంపేట రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) ఉమారాణితో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలు, భవన వసతులు, విద్యార్థుల అవసరాలు, తాగునీటి సమస్యలు, పారిశుద్ధ్య సౌకర్యాలు, భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రత్యేక చొరవ కళాశాలలో విద్యార్థుల విద్యా అవసరాలకు అనుగుణంగా అదనపు తరగతి గదుల నిర్మాణం అత్యంత అవసరమని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు మెరుగైన బోధన వాతావరణం కల్పించడంతోపాటు భవిష్యత్తులో పెరిగే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను విస్తరించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు. అదనపు తరగతి గదుల మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించి, అనుమతులు, నిధుల సాధనకు ప్రత్యేకంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగం, కళాశాల అధికారుల సమన్వయంతో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్వో ప్లాంట్, బోర్‌వెల్ మోటార్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉండటం అత్యంత ప్రాధాన్యమైన అంశమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కళాశాల లో ఇదివరకే మిషన్ భగీరథ ద్వారా ప్రత్యేక నీటి వసతిని ఏర్పాటు చేశానని ఇప్పుడు ప్రాంగణంలో ఆర్వోవాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతోపాటు బోర్‌వెల్ మోటార్ సౌకర్యాన్ని సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లను ప్రాధాన్యతతో చేపట్టాలని, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మరుగుదొడ్ల మరమ్మతులు పారిశుద్ధ్య సౌకర్యాల మెరుగుదల విద్యాసంస్థల్లో పరిశుభ్రమైన వాతావరణం, సరైన పారిశుద్ధ్య సౌకర్యాలు విద్యార్థుల ఆరోగ్యం, గౌరవం, సంక్షేమానికి ఎంతో అవసరమని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. కళాశాలలో ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టి, వాటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత విద్యా సంవత్సరంలో కళాశాల ఉన్నత స్థాయిలో నిలవడానికి చేసిన కృషితోపాటు రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్ పురస్కారాన్ని అందుకున్నందుకు ప్రొఫెసర్ మల్లం నవీన్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

# పాలన చేతకాకపోతే గద్దె దిగాలి..!!

– మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు




కొడకండ్ల, అక్టోబరు 25 ప్రభాతవార్త :

పాలన చేతకాకపోతే సీఎం రేవంత్‌రెడ్డి గద్దె దిగాలని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఓటరు నమోదు కార్యక్రమంపై బీఆర్ఎస్‌పార్టీ ముఖ్యనాయకులతో కొడకండ్ల మండలకేంద్రంలోని బీఆర్ఎస్‌పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని నాయకులకు, కార్యకర్తలకి దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి సుధీర్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం పురోగతిపై నాయకులతో సమీక్షించి, అర్హులైన ప్రతిఒక్క గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీనాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల్లోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటునమోదుపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ గతంలో కరోనాసమయంలోనూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు నీరు, విద్యుత్‌సహా అవసరమైన సేవలు అందేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చేతులెత్తేసి నావల్లకాదు అంటున్నాడని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రి ఎందుకు ఆ కుర్చీలో ఉన్నావని నిలదీశారు. దేవాదుల ప్రాజెక్టులో పంపులుఎందుకు ఆన్ చేయలేదని సూటిగా ప్రశ్నించారు. అధికారులను అడిగితే కనీసం మోటార్లుకూడా రిపేర్ చేసేందుకు డబ్బులు లేవనిఅంటున్నారు సార్ అని వారు మొరపెట్టుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కరెంట్‌కోతల పాపం సీఎంరేవంత్ రెడ్డిదేనని విమర్శించారు. కరోనా సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ఆదుకున్న ఘనత కేసీఆర్‌దని గుర్తు చేసుకున్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఎనిమిది నెలలుకష్టమే అని చేతులుఎత్తేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ఇదంతా రేవంత్‌రెడ్డి చేసిన పాపమేనని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా కళ్ళు తెరవాలని హితవు పలికారు. ఒకప్పుడు చంద్రబాబు నాయుడు తెలంగాణలో భూములరేట్లు అధికంగా ఉన్నాయన్నారని కానీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో భూముల ధరలు పెరుగుతున్నాయి. తెలంగాణలో పడిపోతున్నాయని దీనికి కారణం ఈ మూర్ఖపు రేవంత్‌రెడ్డే కారణమని ఎర్రబెల్లి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల భాగస్వామ్యం పెరిగేలా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో మండల బీఆర్ఎస్‌పార్టీ ముఖ్యనాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కష్టాలే పునాదిగా.. ప్రజాసేవే ఊపిరిగా.. సీతక్క ప్రస్థానం!

అడవిబాట నుంచి ప్రజాపాలన వరకు.. అణగారిన వర్గాల ఆశాకిరణంగా ఎదిగిన పోరాట యోధురాలు!



గోవిందరావుపేట, ప్రభాతవార్త:

పసిప్రాయంలోనే కష్టాలను చవిచూసి.. కన్నీళ్ల మధ్య జీవిత పాఠాలు నేర్చుకొని.. ఎదురైన సవాళ్లకు తలవంచకుండా ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన పోరాట యోధురాలు మంత్రి సీతక్క. ఒకప్పుడు తన జీవితంలో ఎదురైన కష్టాలే.. నేడు ఇతరుల బాధలను అర్థం చేసుకునే మనసుకు పునాదులయ్యాయి. తన కన్నీటి గతాన్ని బలంగా మలుచుకొని, పేదల కన్నీళ్లు తుడవాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న ఆమె ప్రస్థానం ఎందరికో స్ఫూర్తిదాయకం.

**కష్టాల నుంచి కర్తవ్యబాటకు..**

జీవితం విసిరిన సవాళ్లు ఆమె అడుగులను ఆపలేకపోయాయి. ఒడిదుడుకులు ఆమె సంకల్పాన్ని దెబ్బతీయలేకపోయాయి. అడవుల బాటలో సాగిన ఆమె ప్రయాణం.. ఆదివాసీ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, అభివృద్ధి ఆకాంక్షలతో ముడిపడింది. ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుంటూ, అణగారిన వర్గాల గొంతుకగా ఎదగడం ఆమె రాజకీయ ప్రస్థానంలో ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది.

**అధికారం అలంకారం కాదు.. సేవకు బాధ్యత!**

పదవి అంటే హోదా మాత్రమే కాదని.. ప్రజలకు సేవ చేసే బాధ్యత అని చాటాలనే సంకల్పంతో సీతక్క ముందుకు సాగుతున్నారు. పేదల సమస్యలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, మహిళల సంక్షేమం, ఆడబిడ్డల భవిష్యత్తు వంటి అంశాలపై ప్రజా ప్రతినిధిగా తన బాధ్యతను నిర్వర్తించాలనే లక్ష్యంతో ఆమె ప్రస్థానం కొనసాగుతోంది. ప్రజల బాధలో తన బాధను చూసే మనసు.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలనే తపన.. ఆమెకు ప్రజలతో ఆత్మీయ అనుబంధాన్ని పెంచుతున్నాయి.

**కన్నీళ్లను చూసిన హృదయం.. కష్టాలను అర్థం చేసుకునే మనసు!**

తన బాల్యం ఎన్నో సవాళ్లతో నిండినా.. తన భవిష్యత్తును ప్రజల ఆశలతో ముడిపెట్టుకున్న నాయకురాలిగా సీతక్క గుర్తింపు పొందారు. ఒకప్పుడు తాను ఎదుర్కొన్న కష్టాలు ఇతరులకు ఎదురుకాకూడదనే భావనతో పేదలు, గిరిజనులు, మహిళల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే ఆశయంతో ముందుకు సాగుతున్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం, అభివృద్ధి ఫలాలను అర్హులకు అందించడం, మారుమూల ప్రాంతాలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయడం ఆమె ముందున్న కీలక బాధ్యతలు.

**ప్రజల ఆశలే బలం.. అభివృద్ధే అసలైన లక్ష్యం!**

కన్నీటి గతం నుంచి ప్రజాజీవితంలో ప్రత్యేక స్థానం సంపాదించే వరకు సాగిన సీతక్క ప్రయాణం ఒక మహిళా పోరాటగాథ మాత్రమే కాదు.. కష్టాలను అధిగమించి ప్రజాసేవను జీవిత లక్ష్యంగా ఎంచుకున్న నాయకురాలి ప్రస్థానం. అయితే ప్రజల అభిమానం మరింత బలపడాలంటే వారి ఆశలకు తగిన అభివృద్ధి, సమస్యలకు సకాలంలో పరిష్కారాలు, గిరిజన ప్రాంతాలకు మెరుగైన విద్య, వైద్యం, రహదారులు, ఉపాధి అవకాశాలు అందించడమే కీలకం.కష్టాలు ఆమెకు ధైర్యాన్ని నేర్పాయి.. జీవితం పోరాటాన్ని పరిచయం చేసింది.. ప్రజల సమస్యలు సేవా మార్గాన్ని చూపించాయి. ఆ మార్గంలో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపాలనే సంకల్పంతో సాగుతున్న మంత్రి సీతక్క ప్రస్థానం.. ప్రజల గుండెల్లో చెరగని సంతకంగా నిలవాలంటే ప్రజాసేవే కొలమానంగా ముందుకు సాగాలి.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదులో పాల్గొన్న శ్రీపాల్ రెడ్డి

-మరిపెడ 10వ వార్డులో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం



మరిపెడ,అక్టోబర్25,ప్రభాతవార్త:

రానున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో ఆదివారం పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పీసారపు శ్రీపాల్ రెడ్డి పాల్గొని పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టభద్రులు ఓటరు నమోదుపై అవగాహన కలిగి ఉండాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రంజిత్ కుమార్, కిరణ్, తరుణ్, రాజ్ కుమార్, సందీప్, వికాస్, రాజా, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులు పీఎం రహత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్




ప్రభాతవార్త, హన్మకొండ టౌన్ :

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన పీఎం రహత్ ( పి ఎం రహత్ - ప్రైమ్ మినిస్టర్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ హాస్పిటలైజేషన్ అండ్ అస్యూర్డ్ ట్రీట్మెంట్ ) పథకాన్ని అర్హులైన బాధితులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో మొత్తం 63 ఎంప్యానెల్డ్ ఆసుపత్రుల్లో ఈ పథకం కింద వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హత నిబంధనలకు అనుగుణంగా రూ.1.5 లక్షల వరకు గరిష్ఠంగా ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స పొందవచ్చని పేర్కొన్నారు.

**ఈ సందర్భంగా ప్రజలకు సీపీ ఈ క్రింది సూచనలు చేశారు**

రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సహాయం కోసం 112 నంబర్‌కు కాల్ చేయాలి. క్షతగాత్రులను వీలైనంత త్వరగా సమీపంలోని ఎంప్యానెల్డ్ ఆసుపత్రికి తరలించేలా సహకరించాలి. పథకం కింద వైద్య సేవలు పొందేందుకు ఆసుపత్రి సిబ్బందిని సంప్రదించి, అవసరమైన వివరాలను అందించాలి. ప్రమాద బాధితులకు సహాయం చేయడంలో మానవతా దృక్పథంతో వ్యవహరించి, పోలీసులకు మరియు వైద్య సిబ్బందికి సహకరించాలి. రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, ప్రజలు పీ.ఎం.రహత్ పథకంపై అవగాహన పెంపొందించుకుని అర్హులైన బాధితులకు ఈ పథకం ప్రయోజనాలు అందేలా సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు.